ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు ,
జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి
పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts
సంపుటి - 03 సంచిక -44 పేజీలు - 8 వెల - 03/- బుధవారం 3 జూన్ 2026

# ఇంకెంత కాలం ఆంధ్రావాళ్లను తిడతారు

## జనసేన పుట్టిందే తెలంగాణలో అందుకే ఇక్కడి ఎన్నికల్లో పోటీ చేస్తుంది

**తెలంగాణ గడ్డపై నుంచే పోరాటం పుణికి పుచ్చకున్నా**

**తెలంగాణ అంటే గౌరవంతోనే కొండగట్టుకు కోట్ల విరాళం**

**తెలంగాణను వ్యతిరేకించిన వారే ఎమ్మెల్యేలుగా ఉన్నారు**

**తెలంగాణకు ద్రోహం జరిగితే గొంతు లేపేది జనసేనే**

**తెలంగాణపై తనకున్న ప్రేమ రాజకీయాలకు అతీతం**

**ఎవరి తాటాకు చప్పళ్లకు భయపడేది లేదు**

**మీడియా సమావేశంలో పవన్ కళ్యాణ్ స్పష్టీకరణ**

**హైదరాబాద్,జూన్ 02,(రిపబ్లిక్ న్యూస్):** : తెలంగాణలో జనసేన పార్టీ ఉంటుందని ఆ పార్టీ అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రకటించారు. తెలంగాణలో పోటీ చేస్తామని ఆయన కుండ బద్దలు కొట్టారు. మంగళవారం జూబ్లీహిల్స్‌లోని జనసేన పార్టీ కార్యాలయంలో పవన్ కల్యాణ్ మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పవన్ కల్యాణ్ మాట్లాడారు. దేశంలో అంతర్భాగం తెలంగాణ అని స్పష్టం చేశారు. మిగతాది 2లో...



# మూడో దేశం జోక్యం కుదరదు




**నేపాల్ ప్రధాని వ్యాఖ్యలపై భారత్ ఘాటు స్పందన**

**భారత్-నేపాల్ సరిహద్దు వివాదంలో మూడో దేశం జోక్యం కుదరదని స్పష్టం చేసిన భారత్**

**ఇది పూర్తిగా ద్వైపాక్షిక అంశమని భారత విదేశాంగ శాఖ వెల్లడి**

**భారత్, నేపాల్ పరస్పరం భూభాగాలు ఆక్రమించుకున్నాయన్న నేపాల్ ప్రధాని వ్యాఖ్యలు**

**ద్వైపాక్షిక చర్చలకే కట్టుబడి ఉన్నామని భారత్ స్పష్టీకరణ**

**న్యూఢిల్లీ :జూన్ 02,(రిపబ్లిక్ న్యూస్):** భారత్, నేపాల్ మధ్య ఉన్న సరిహద్దు వివాదం పూర్తిగా ద్వైపాక్షిక అంశమని, ఇందులో మూడో దేశం ప్రమేయానికి ఆస్కారమే లేదని భారత్ మరోసారి స్పష్టం చేసింది. ఇరు దేశాల మధ్య ఉన్న సమస్యలను చర్చల ద్వారా, చారిత్రక ఆధారాల ప్రాతిపదికన పరిష్కరించుకోవాలని పేర్కొంది.నేపాల్ ప్రధాని బాలేంద్ర షా ఇటీవల పార్లమెంటులో చేసినమిగతా 2లో...

# అమరావతి రైతులకు అండగా ఉంటాం

**లీగల్ ప్యానెల్ ఏర్పాటు చేసి న్యాయపోరాటం చేస్తాం**

**అవసరం అయితే భూములు వెనక్కి ఇస్తాం**

**మాజీ సిఎం వైఎస్ జగన్**



**అమరావతి:జూన్ 02,(రిపబ్లిక్ న్యూస్):** అమరావతి రాజధాని రైతులకు అండగా ఉంటామని మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత జగన్ మోహన్ రెడ్డి చెప్పారు. మంగళవారం తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో రాజధాని ప్రాంతానికి చెందిన ఉండవల్లి, పెనుమాక, నిడమర్రు, ఎర్రపాలెం, కుర్రగల్లు గ్రామాలకు చెందిన రైతులు ఆయన్ను కలిశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ అమరావతి రైతుల కోసం పార్టీ తరపున లీగల్ ప్యానెల్ ఏర్పాటు చేస్తామని జగన్ మోహన్ రెడ్డి తెలిపారు. అక్కడి రైతుల భూములు కాపాడేందుకు న్యాయ పోరాటం చేస్తామని, రైతుల భూములు బలవంతంగా లాక్కోవడం దారుణమని పేర్కొన్నారు. అమరావతి రైతులకు న్యాయం చేస్తామని, ఇప్పుడు దౌర్జన్యం చేస్తున్న వారందరి పని పడతామని అన్నారు. తప్పు చేస్తున్న ప్రతి ఒక్కరూ మూల్యం చెల్లించాల్సిందేనని అన్నారు. రైతులను సంతోష పెట్టే విధంగామిగతా 2లో...

# ఎస్ఐఆర్‌పై నిర్లక్ష్యం వద్దు..

## గొడ్డలి పార్టీతో జాగ్రత్త: శ్రేణులకు చంద్రబాబు కఠిన సందేశం

**ఎస్ఐఆర్‌ను నిర్లక్ష్యం చేయొద్దని పార్టీ శ్రేణులకు చంద్రబాబు ఆదేశం**

**చిన్న పామునైనా పెద్ద కర్రతో కొట్టాలంటూ ప్రత్యర్థి పార్టీపై తీవ్ర వ్యాఖ్యలు**

**ఎస్ఐఆర్ ప్రక్రియలో మిత్రపక్షాలైన జనసేన, బీజేపీలతో సమన్వయం ముఖ్యం అని సూచన**

**కార్యకర్తల సంక్షేమం, సాధికారతకు పార్టీ పెద్దపీట వేస్తుందని హామీ**






**అమరావతి:జూన్ 02,(రిపబ్లిక్ న్యూస్):** ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను అత్యంత సీరియస్‌గా తీసుకోవాలని, ఈ విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా భవిష్యత్తులో నష్టపోతామని తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ శ్రేణులకు గట్టిగా దిశానిర్దేశం చేశారు. అదే సమయంలో, 'గొడ్డలి పార్టీ' విషయంలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, 'చిన్న పామునైనా పెద్ద కర్రతో కొట్టాలి'మిగతా 2లో...

# ఎస్సీ వర్గాల సమస్యల పరిష్కారానికి కమిషన్ కట్టుబడి ఉంది




# తమిళనాడులో బీజేపీకి గట్టి షాక్.. పార్టీకి అన్నామలై రాజీనామా!

**పార్టీ పొత్తులు, అవకాశాలపై తీవ్ర అసంతృప్తి**

**త్వరలో సొంతంగా రాజకీయ ఉద్యమం ప్రారంభించే అవకాశం**

**జూన్ 02,(రిపబ్లిక్ న్యూస్):** తమిళనాడు బీజేపీకి భారీ ఎదురుదెబ్బ తగిలింది. పార్టీ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు, ఫైర్ బ్రాండ్ నేతగా పేరుపొందిన అన్నామలై మంగళవారం పార్టీకి రాజీనామా చేశారు. ఢిల్లీలో బీజేపీ నూతన జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్, మిగతా 2లో...



# భారత్‌లో ఎబోలా కేసులు లేవు.. కానీ!: కేంద్రం కీలక అడ్వైజరీ

**అంతర్జాతీయ ప్రయాణికుల కోసం కేంద్ర ఆరోగ్య శాఖ మార్గదర్శకాలు**

**ప్రపంచ ఆరోగ్య సంస్థ హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించడంతో అప్రమత్తత**

**ఈ వైరస్‌కు టీకాలు లేకపోవడంపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళన**

**న్యూఢిల్లీ :జూన్ 02,(రిపబ్లిక్ న్యూస్):** భారతదేశంలో ఇప్పటివరకు ఒక్క ఎబోలా కేసు కూడా నమోదు కాలేదని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. అయితే, కొన్ని ఆఫ్రికా దేశాల్లో ఈ వైరస్ వ్యాప్తి తీవ్రమవుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ముఖ్యంగా అంతర్జాతీయ ప్రయాణికుల కోసంమిగతా 2లో...




# రాష్ట్రాభివృద్ధే సంకల్పం

**తెలంగాణ రైజింగ్ సారధులు రైతులు, రైతు కూలీలే**

**2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ ఎకానమీనే లక్ష్యం**

**గ్రీన్ ఫీల్డ్ స్మార్ట్ సిటీగా ఫ్యూచర్ సిటీ**

**ఆర్థిక శక్తి కేంద్రాలుగా మహిళా సంఘాలు**

**:(సీఎం ఏ రేవంత్‌రెడ్డి(ఘనంగా తెలంగాణ రాష్ట్రావతరణ వేడుకలు**

**జాతీయ పతకాన్ని ఆవిష్కరించిన ముఖ్యమంత్రి**

**18 మంది పోలీసులకు ప్రతిభా పురస్కారాలు**

**హైదరాబాద్‌జూన్ 02,(రిపబ్లిక్ న్యూస్):** తెలంగాణ రైజింగ్-2047కు సారధులు రైతులు, రైతు కూలీలేనని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. 2047నాటికి మూడు ట్రిలియన్ డాలర్ ఎకానమీ సంకల్పం, తెలంగాణను ప్రపంచానికే గేట్‌వేగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం మిగతా 2లో...



# సీబీఎస్ఈ చైర్మెన్, సెక్రెటరీ బదిలీ

**ఓఎస్ఎం సేవలపై విచారణా కమిటీ**

**వివాదం నేపథ్యంలో కేంద్రం నిర్ణయాలు**

**పార్లమెంట్ ప్యానల్ కమిటీ ఎదుటకు రాక ముందే చర్యలు**





# బంగారం రీసైకిల్ చేద్దాం

**: ప్రధాని మోదీ పిలుపు**

**బంగారం దిగుమతులు తగ్గించి విదేశీ మారక నిల్వలను కాపాడటమే లక్ష్యం**

**ఒక శాతం బంగారం రీసైకిల్ చేసినా దిగుమతులు 30% తగ్గుతాయని నిపుణుల అంచనా**

**న్యూఢిల్లీ :జూన్ 02,(రిపబ్లిక్ న్యూస్):** ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో నెలకొన్న అనిశ్చితుల నేపథ్యంలో దేశ విదేశీ మారక నిల్వలపై ఒత్తిడిని తగ్గించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ ప్రజలకు ఒక కీలక పిలుపునిచ్చారు. కొత్తగా బంగారం దిగుమతి చేసుకునే బదులుగా ఇళ్లలో, దేవాలయాల్లో నిరుపయోగంగా ఉన్న బంగారాన్ని రీసైక్లింగ్ చేయడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలని ఆయన సూచించారు.మిగతా 2లో...



# ఎస్ఐఆర్‌పై నిర్లక్ష్యం వద్దు..

**మొదటిపేజీ తరువాయి**

అంటూ ప్రత్యర్థి పార్టీని ఉద్దేశించి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు, పరిశీలకుల కోసం నిర్వహించిన ఎస్ఐఆర్ వర్క్‌షాప్‌లో ఆయన ప్రసంగించారు. ఈ కార్యక్రమం పార్టీ భవిష్యత్ కార్యాచరణకు, ప్రభుత్వ పనితీరుకు అద్దం పట్టేలా సాగింది.

**ఎస్ఐఆర్‌పై నిర్లక్ష్యం వద్దు..**

ప్రతి 20-25 ఏళ్లకు ఒకసారి జరిగే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియ అత్యంత కీలకమని చంద్రబాబు ఉద్ఘాటించారు. “ఏ ఎన్నికలకైనా ఓటర్ల జాబితానే పునాది. దీని ఆధారంగానే వ్యూహాలు, ప్రణాళికలు ఉంటాయి. జులై 14లోగా రెండుసార్లు ఓట్ల మ్యాపింగ్ జరుగుతుంది. ఈ లోగా ఓట్ల చేర్పింపుల ప్రక్రియ పక్కాగా పూర్తి కావాలి. మన ఓట్లు ఉన్నాయా, లేవా అని నిరంతరం చూసుకోవాలి. ఎస్ఐఆర్‌ను ప్రతి ఒక్కరూ సీరియస్‌గా తీసుకోవాలి. ఈ ప్రక్రియను నేను ప్రతిరోజూ పర్యవేక్షిస్తాను“ అని స్పష్టం చేశారు. వివిధ ప్రాంతాల్లో ఉన్న ఏపీ ఓటర్లు తిరిగివచ్చి ఓటు వేయడం వల్లే కూటమి 164 స్థానాల్లో గెలిచిందని, ఈ స్ఫూర్తిని కొనసాగించాలన్నారు.

**‘గొడ్డలి పార్టీ‘తో జాగ్రత్త..**

ప్రతిపక్షంపై విరుచుకుపడుతూ చంద్రబాబు తీవ్ర పదజాలం ఉపయోగించారు. “చిన్న పామునైనా పెద్ద కర్రతో కొట్టాలి, లేకపోతే అది విషం చిమ్ముతుంది. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలి. గొడ్డలి పార్టీతో



నిరంతరం అప్రమత్తంగా ఉండాలి. నేను ఎన్నో పోరాటాలు చేశాను కానీ, ఇలాంటి నీచులతో ఎప్పుడూ చేయలేదు“ అని అన్నారు.

మెగా డీఎస్సీపై తప్పుడు ప్రచారం చేశారని, గట్టిగా కౌంటర్ ఇవ్వగానే తోక ముడిచారని విమర్శించారు. నంద్యాలలో వైఎస్ విగ్రహం తలను వైసీపీ కార్యకర్తే తొలగించాడని, పోలీసులు వేగంగా స్పందించకుంటే ఆ నెపం టీడీపీపై నెట్టేవారని ఆరోపించారు. వివేకా హత్య కేసు ఒక కేస్ స్టడీ అని, ఇలాంటి కుట్రపూరిత రాజకీయాలపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

**మిత్రధర్మం మనకు తొలి పరీక్ష..**

ప్రభుత్వంలోనే కాకుండా, పార్టీ కార్యక్రమాల్లోనూ మిత్రపక్షాలైన జనసేన, బీజేపీలతో సంపూర్ణ సమన్వయం పాటించాలని చంద్రబాబు స్పష్టం చేశారు. “ఎన్నికలప్పుడు కలిసి, మిగతా రోజుల్లో పట్టించుకోకపోతే కుదరదు. ఎస్ఐఆర్ ప్రక్రియ మన సమన్వయానికి తొలి పరీక్ష. దీని కోసం మూడు పార్టీలతో కో-ఆర్డినేషన్ కమిటీ వేస్తాం. క్షేత్రస్థాయిలో కొన్నిచోట్ల మిత్రపక్షాలు లేకపోయినా, వారిని కలుపుకొని వెళ్లాలి. 2024 ఎన్నికల కంటే ఎక్కువగా వారితో కలిసి పనిచేయాలి. మిత్రధర్మాన్ని ప్రతి నాయకుడు, కార్యకర్త పాటించాల్సిందే“ అని ఆదేశించారు.

**కార్యకర్తలే పార్టీకి బలం.. ఇంటింటికీ ప్రచారం**

కార్యకర్తల సంక్షేమం, సాధికారతకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని చంద్రబాబు భరోసా ఇచ్చారు. కార్యకర్తల కుటుంబాలకు రూ.5 లక్షల బీమా, పిల్లల చదువు, నైపుణ్య శిక్షణ వంటి కార్యక్రమాలను వివరించారు. తాను అనుచరులను కాదని, సమర్థవంతమైన నాయకులను కోరుకుంటానని, అలాంటి నాయకత్వమే పార్టీకి బలమని అన్నారు.

రాబోయే కార్యాచరణను ప్రకటిస్తూ.. “జులై 15 నుంచి ఆగస్టు నెలాఖరు వరకు 45 రోజుల పాటు ఇంటింటి ప్రచారం చేపడతాం. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిద్దాం. ఈ ప్రచారంలో నేను కూడా పాల్గొంటాను. అందరం సైకిళ్లపై, వీలైతే ఈ-సైకిళ్లపై వెళ్లి ప్రజలను కలుద్దాం“ అని పిలుపునిచ్చారు. పోలవరం ప్రాజెక్టును తిరిగి గాడిన పెట్టామని, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తో రాష్ట్రాభివృద్ధికి బాటలు వేశామని, ఈ విజయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు. నామినేటెడ్ పదవుల్లోనూ సామాజిక న్యాయం పాటిస్తామని హామీ ఇచ్చారు.

# భారత్‌లో ఎబోలా కేసులు లేవు.. కానీ!: కేంద్రం కీలక అడ్వైజరీ

**మొదటిపేజీ తరువాయి**

మార్గదర్శకాలను జారీ చేసింది.

గత 21 రోజుల్లో ఎబోలా ప్రభావిత దేశాల నుంచి వచ్చిన వారు లేదా ఆ దేశాల మీదుగా ప్రయాణించిన వారు తమ ఆరోగ్యాన్ని స్వయంగా పర్యవేక్షించుకోవాలని సూచించింది. ఎబోలా ప్రభావిత దేశాల్లో ప్రయాణించినవారు స్వీయ నిర్బంధంలోకి వెళ్ళాలని సూచించింది.జ్వరం, తీవ్రమైన బలహీనత, కండరాల నొప్పి, తలనొప్పి, గొంతునొప్పి, వాంతులు, విరేచనాలు, దద్దుర్లు లేదా కారణం లేకుండా రక్తస్రావం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని కోరింది. ముందస్తు సమాచారంతో మీ ప్రాణాలను కాపాడుకోవడంతోపాటు వ్యాధి వ్యాప్తిని కూడా నిరోధించవచ్చని తెలిపింది. అధికారుల సాయం కోసం హెల్ప్ లైన్ నెంబర్ 1075కు కాల్ చేయాలని సూచించింది.

డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో (డీఆర్‌సీ), ఉగాండా, దక్షిణ సూడాన్‌లలో కొత్త రకం ఎబోలా వైరస్ వ్యాప్తి చెందుతోంది. ఈ నేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) మే 17న దీనిని ప్రజారోగ్య అత్యవసర పరిస్థితిగా ప్రకటించింది. ఈ ప్రత్యేక వైరస్‌కు ప్రస్తుతం ఆమోదిత టీకాలు లేదా నిర్దిష్ట చికిత్సలు అందుబాటులో లేకపోవడం ప్రపంచవ్యాప్తంగా ఆందోళన పెంచుతోంది.

**భారత్ తీసుకుంటున్న చర్యలు**

ఈ పరిస్థితుల దృష్ట్యా భారత ప్రభుత్వం పలు ముందుజాగ్రత్త చర్యలు చేపట్టింది. డీఆర్‌సీ, ఉగాండా, దక్షిణ సూడాన్‌లకు అనవసర ప్రయాణాలు మానుకోవాలని పౌరులకు సూచించింది. విమానాశ్రయాలు, ఓడరేవుల్లో ప్రభావిత ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికుల స్క్రీనింగ్‌ను కట్టుదిట్టం చేసింది. వ్యాధి లక్షణాలు ఉన్నవారు ఇమ్మిగ్రేషన్ క్లియరెన్స్‌కు ముందే ఎయిర్‌పోర్ట్ ఆరోగ్య అధికారులకు తప్పనిసరిగా రిపోర్ట్ చేయాలని ఆదేశించింది.

ప్రధాని నరేంద్ర మోదీ మార్గదర్శకత్వంలో కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా పరిస్థితిని సమీక్షించినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతానికి దేశంలో ఎలాంటి కేసులు లేనప్పటికీ, అంతర్జాతీయ సంస్థలతో సమన్వయం చేసుకుంటూ పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నట్లు ఆరోగ్య శాఖ వర్గాలు స్పష్టం చేశాయి.

# బంగారం రీసైకిల్ చేద్దాం : ప్రధాని మోదీ పిలుపు

**మొదటిపేజీ తరువాయి**

ఈ విధానం ద్వారా బంగారం దిగుమతులపై ఆధారపడటాన్ని గణనీయంగా తగ్గించవచ్చని ప్రధాని అభిప్రాయపడ్డారు.

భారత్ ప్రపంచంలోనే రెండో అతిపెద్ద బంగారం వినియోగదారుగా ఉన్నప్పటికీ, దేశీయంగా ఉత్పత్తి చాలా స్వల్పం. ఈ కారణంగా ఏటా బిలియన్ల కొద్దీ డాలర్లను వెచ్చించి బంగారాన్ని దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. ముఖ్యంగా 2025-26 ఆర్థిక సంవత్సరంలో మన దేశం సుమారు 72.4 బిలియన్ డాలర్ల విలువైన బంగారాన్ని దిగుమతి చేసుకుంది. ఇది ముడి చమురు తర్వాత దేశ దిగుమతి బిల్లులో అతిపెద్దది. బంగారం దిగుమతులకు చెల్లింపులు యూఎస్ డాలర్లలో చేయాల్సి రావడం వల్ల, రూపాయి విలువపై ఒత్తిడి పెరిగి, కరెంట్ అకౌంట్ లోటు విస్తరిస్తోంది. ఈ సమస్యకు పరిష్కారంగానే ప్రధాని రీసైక్లింగ్‌ను ప్రోత్సహిస్తున్నారు. అంచనాల ప్రకారం ప్రస్తుతం దేశంలోని గృహాలు, దేవాలయాల్లో దాదాపు 30,000 నుంచి 32,000 టన్నుల బంగారం నిరుపయోగంగా ఉంది. ఈ పాత ఆభరణాలు, నాణేలు, మరియు ఇతర బంగారు వస్తువులను కరిగించి, శుద్ధి చేసి, 99.9% స్వచ్ఛమైన బంగారంగా మార్చవచ్చు. ఈ బంగారాన్ని తిరిగి కొత్త ఉత్పత్తుల తయారీకి ఉపయోగించడం వల్ల దిగుమతుల అవసరం తగ్గుతుంది.

రీసైక్లింగ్ విధానం ఆర్థిక వ్యవస్థకు ఎంతో ఉపయోగకరం పరిశ్రమ నిపుణులు సైతం ప్రధాని ప్రతిపాదనను సమర్థిస్తున్నారు. ముత్తూట్ ఎగ్జిమ్ సీఈఓ కీయూర్ షా అంచనా ప్రకారం దేశంలో ఉన్న మొత్తం బంగారంలో కేవలం 1% ఏటా రీసైక్లింగ్‌కు వచ్చినా, మన దిగుమతులు 25 నుంచి 30 శాతం వరకు తగ్గుతాయి. స్వస్తిక ఇన్వెస్ట్‌మార్ట్ పరిశోధన హెడ్ సంతోష్ మీనా మాట్లాడుతూ, వ్యవస్థీకృత రీసైక్లింగ్ విధానం విదేశీ మారక నిల్వలపై ఒత్తిడిని తగ్గించడమే కాకుండా వాణిజ్య లోటును నియంత్రించి, దేశాన్ని ఆత్మనిర్భర్ దిశగా నడిపిస్తుందని వివరించారు.

ప్రధాని పిలుపును జ్యువెలరీ సంఘాలు స్వాగతించాయి. పాత బంగారాన్ని మార్చుకునే వారికి తక్కువ తరుగుతో కొత్త డిజైన్లు అందించే కార్యక్రమాలను ఇప్పటికే ప్రారంభించాయి. మరోవైపు బంగారం ధరలు రికార్డు స్థాయిలో ఉండటంతో వివాహాలు, ఉన్నత విద్య వంటి అవసరాల కోసం పాత నగలను మార్చుకోవడం వినియోగదారులకు కూడా లాభదాయకంగా మారింది. మొత్తంమీద దిగుమతి చేసుకునే వినియోగదారుగా కాకుండా, దేశంలో ఉన్న వనరులనే సమర్థంగా వాడుకునే ఆర్థిక వ్యవస్థగా మారాలనేది ఈ పిలుపు వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం.

# ఇంకెంత కాలం ఆంధ్రావాళ్లను తిడతారు

**(మొదటి పేజి తరువాయి)**

తెలంగాణను వ్యతిరేకించిన వారే.. పదవుల్లో ఉన్నారని.. ఎమ్మెల్యేలు అయ్యారని పవన్ కల్యాణ్ వివరించారు. తెలంగాణ అంటే గౌరవం ఉంది కనుకే కొండగట్టు ఆలయానికి కోట్ల రూపాయిలు విరాళంగా ఇచ్చామన్నారు. మీ తాటాకు చప్పుళ్లకు జనసేన పార్టీ భయపడదన్నారు. భయపడేవాడినే అయితే పార్టీ పెడతానా? అని ప్రశ్నించారు. తెలంగాణకు ద్రోహం జరిగితే మొట్టమొదట గొంతులేపేది జనసేన పార్టీనే అని స్పష్టం చేశారు. ఏం చేసినా ఓట్ల కోసం కాదు.. తనకు తెలంగాణపై ప్రేమ, మమకారం ఉన్నాయన్నారు. గుంటూరులో టీఆర్ఎస్ కార్యాలయం పెడితే స్వాగతించామని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోనే కాదు.. ఇక్కడ ఏమైనా చేస్తే తాను సీఎం అయిపోతానా? అని పవన్ కల్యాణ్ ప్రశ్నించారు. తెలంగాణను తానెప్పుడు అవమానించానని ఆయన స్థానిక నేతలను ప్రశ్నించారు. తన పీక కోసినా కూడా భయపడేది లేదన్నారు. తనకు రెచ్చగొట్టడం ఇష్టం లేదని తెలిపారు. తనను ఎన్ని తిట్టినా పట్టించుకోనన్నారు. తెలంగాణలో ఉపాధి లేకపోతే తాను కారణమా? అని రాజకీయ పార్టీల నాయకులను ఆయన సూటిగా నిలదీశారు. మద్రాస్‌లో ఉన్న చిత్రపరిశ్రమ ఇక్కడికి ఎలా వచ్చిందన్నారు. ఆంధ్రా వాళ్లను తిడుతుంటే వాళ్లు ఇక్కడెలా ఉంటారన్నారు. ఇంకెంతకాలం ఆంధ్రావాళ్లను తిడుతూ కాలక్షేపం చేస్తారంటూ తెలంగాణలోని నాయకులకు ఆయన సూటిగా ప్రశ్నించారు. సడెన్‌గా ఇక్కడికి రావొద్దంటే ఎలా అని ఆయన ప్రశ్నించారు. తెలంగాణలో ఏపీ కాంట్రాక్టర్లు బాగానే ఉన్నారన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై తనకు గౌరవం ఉందన్నారు. తాను చెరువును కబ్జా చేశానని కొందరు అంటున్నారని.. అలా చేస్తే తనను ఇక్కడ ఉండనిస్తారా? అని ఆయన సూటిగా నిలదీశారు. తన ఫామ్‌హౌస్ కబ్జా అని తేలిస్తే.. దానిని రాష్ట్ర ప్రభుత్వానికే రాసిస్తానన్నారు. గద్దర్‌తో తనకు చాలా సాన్నిహిత్యం ఉందని గుర్తు చేసుకున్నారు. రాజకీయాల్లోకి రాకముందే తనకు గద్దర్ తెలుసునన్నారు. గద్దర్ ఒంట్లో బుల్లెట్లు దిగినప్పుడు ఎందుకు మాట్లాడలేదని రాజకీయ పార్టీల నేతలను పవన్ కల్యాణ్ సూటిగా ప్రశ్నించారు. గద్దర్ తమ పార్టీ కార్యాలయానికి వచ్చేవారని గుర్తు చేశారు. గద్దర్ బతికున్నప్పుడు మీరంతా ఎక్కడున్నారు? అంటూ తనను ప్రశ్నిస్తున్న నేతలకు పవన్ కల్యాణ్ చురకలంటించారు.తెలంగాణ పోరాట స్ఫూర్తితో ఉత్తేజం పొందామని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. తెలంగాణపై తనకున్న ప్రేమ రాజకీయాలకు అతీతమైనదన్నారు. తెలంగాణపై తనకు కొత్తగా వచ్చిన ప్రేమ కాదని పేర్కొన్నారు. 13వ ఏట అడుగుపెడుతున్న తెలంగాణకు శుభాకాంక్షలు తెలిపారు. లక్ష మందికిపైగా జనసేన నాయకులు, సైనికులు ఉన్న.. తెలంగాణలో కేడర్ తరపున ప్రజలకు శుభాకాంక్షలు చెప్పారు. తెలంగాణలో జనసేన పార్టీ పుట్టిందని గుర్తు చేశారు. ఇక్కడి నాయకులంతా 2007-08 నుంచి.. అప్పటి యువరాజ్యంలో సభ్యులని వివరించారు. తెలంగాణ నలుమూలలా పెరిగిన వాడిని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. తెలంగాణ బాగుండాలనే ఎప్పుడూ కోరుకున్నానని తెలిపారు. తన సినిమాల్లో తెలంగాణ స్ఫూర్తి కనిపిస్తుందని చెప్పారు. ఆదిలాబాద్ తాండాల్లో గడిపిన వాడిని.. ఆ తాండాల్లో దాహార్తి తీర్చిన వాడినని ఏపీ డిప్యూటీ సీఎం వివరించారు. తెలంగాణ విభజన తీరుకు తాము వ్యతిరేకమన్నారు. పార్లమెంట్ తలుపులు మూసి రాష్ట్ర విభజించిన తీరును ప్రశ్నించామని చెప్పారు. తనకు వారాహి యాత్రకు అనుమతి ఇచ్చింది తెలంగాణ అని వ్యాఖ్యానించారు. వైసీపీ తనను ఆంధ్రప్రదేశ్‌లో అడుగుపెట్టనివ్వనంటే ఈ ప్రాంతం ఆదరించిందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వివరించారు. ఆంధప్రదేశ్‌లోనే తాను అధికారం కోరుకోలేదన్నారు.

అలాంటిది తెలంగాణలో ఎందుకు కోరుకుంటానని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలు, నాయకులకు ఆంధ్రప్రదేశ్‌పై విద్వేషం లేదన్నారు. విద్వేషం చూపించి ఉంటే ఆ రాష్ట్ర ప్రజలు ఇక్కడ తిరిగేవారు కాదని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో తనకేం పని కొందరు ప్రశ్నిస్తున్నారన్నారు. మీరు ఎవరు తనను బెదిరించడానికి అని ప్రశ్నించారు. తెలంగాణ మీ అయ్య జాగీరా అని వారిని ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ నిలదీశారు. తనపై దాడులు చేస్తామంటున్నారన్నారు. తనకు తెలంగాణలో కంటే ఏపీలోనే బెదిరింపులు అధికంగా ఉన్నాయని చెప్పారు. 2019 తాను ఓడిపోయినప్పుడు.. తెలంగాణ వాసులే.. ఇక్కడ ఆ పరిస్థితి రాదన్నారని ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ గుర్తు చేసుకున్నారు. తెలంగాణలో జనసేన ఎదగాలని ఎంతగానో ఎదురుచూస్తున్నారని తెలిపారు. మీరు ఎన్ని తిట్లు తిట్టినా.. తన గుండెలో తెలంగాణ ఉంటుందని స్పష్టం చేశారు. వైసీపీ గూండాల బెదిరింపుల ముందు ఈ బెదిరింపులు ఓ లెక్కా? అని అన్నారు. ఓ విశ్లేషకుడు ఇక్కడ తన గురించి తప్పుగా మాట్లాడారని తెలిపారు. ఆ విశ్లేషకుడి వల్లే ఈ గొడవ మొదలైందన్నారు. ఆ వ్యాఖ్యలపైనే జనసేన సైనికులు స్పందించారని వివరించారు. కొన్ని చోట్ల కేసులు పెట్టారు.. అందులో తన ప్రమేయం లేదని స్పష్టం చేశారు. పార్టీ స్థాపించి 13 ఏళ్లు గడుస్తున్నా ఇంకా మేం నోరు మూసుకుని కూర్చోవాలా? అంటూ అసహనం వ్యక్తం చేశారు. తెలంగాణలో మార్పు తప్ప మేం అధికారం కోరుకోవడం లేదని పేర్కొన్నారు. దేశంలో చాలా చోట్ల తెలుగువారు ఉన్నారని గుర్తు చేశారు. వాళ్లను అక్కడి నుంచి వెళ్లిపోమనడం కరెక్టేనా? అని ప్రశ్నించారు. ఇదిలావుంటే జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జూబ్లీహిల్స్ నివాసం వద్ద ఉద్రిక్తత నెలకొంది.

# మూడో దేశం జోక్యం కుదరదు

**మొదటిపేజీ తరువాయి**

వ్యాఖ్యల నేపథ్యంలో భారత్ స్పందించింది. సరిహద్దు సమస్య పరిష్కారానికి భారత్, చైనాలతో మాట్లాడడమే కాకుండా, యూకే ప్రభుత్వంతో కూడా మాట్లాడామని చెప్పారు. యూకే ప్రభుత్వం కూడా దీనిపై దృష్టిసారించాలని కోరుకుంటున్నామని, ఎందుకంటే, భారత్ ను బ్రిటీషర్లు పరిపాలించిన చరిత్రతో ఈ సమస్యకు సంబంధం ఉందని వివరించారు.

అంతేకాకుండా, భారత్ తమ భూభాగంలోకి చొరబడినట్లే, నేపాల్ కూడా కొన్ని ప్రాంతాల్లో భారత భూభాగాలను ఆక్రమించుకుందని ఆయన వ్యాఖ్యానించారు.

ఈ వ్యాఖ్యలు నేపాల్ పార్లమెంటులో తీవ్ర దుమారం రేపాయి. ప్రభుత్వ వైఖరిని బలహీనపరిచారంటూ ప్రతిపక్షాలు నిరసన వ్యక్తం చేశాయి. దీంతో నేపాల్ విదేశాంగ శాఖ వెంటనే రంగంలోకి దిగి వివరణ ఇచ్చింది. ప్రధాని వ్యాఖ్యలు సరిహద్దులోని ‘దస్‌గజ‘ (నో-మ్యాన్స్ ల్యాండ్) ప్రాంతంలో ఇరు దేశాల పౌరుల భూ వినియోగానికి సంబంధించినవని, అధికారిక ప్రాదేశిక వాదనలకు కాదని పేర్కొంది. లిపులేఖ్, కాలాపానీ, లింపియాధురా విషయంలో తమ అధికారిక వైఖరిలో ఎలాంటి మార్పు లేదని, ద్వైపాక్షిక చర్చల ద్వారానే సమస్యను పరిష్కరించుకుంటామని స్పష్టం చేసింది.

1816 నాటి సుగౌలీ ఒప్పందం ప్రకారం కాలాపానీ, లిపులేఖ్, లింపియాధురా తమవేనని నేపాల్ వాదిస్తుండగా, ఆ ప్రాంతాలు ఉత్తరాఖండ్‌లో భాగమని భారత్ పేర్కొంటోంది. తాజాగా నేపాల్ ప్రధాని వ్యాఖ్యలపై స్పందించిన భారత్, ఏ దేశం మధ్యవర్తిత్వాన్నయినా తిరస్కరిస్తూ, ఇది కేవలం రెండు దేశాల మధ్య పరిష్కారం కావాల్సిన అంశమని తేల్చిచెప్పింది.

# తమిళనాడులో బీజేపీకి అన్నామలై రాజీనామా!

జాతీయ ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్‌తో సమావేశమై తన రాజీనామా లేఖను సమర్పించారు.

మాజీ ఐపీఎస్ అధికారి అయిన అన్నామలై, 2020లో బీజేపీలో చేరి అనతికాలంలోనే రాష్ట్రంలో కీలక నేతగా ఎదిగారు. అయితే, పార్టీలో తనకు సరైన అవకాశాలు లభించడం లేదని, ముఖ్యంగా 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అన్నాడీఎంకేతో బీజేపీ పొత్తు పెట్టుకోవడంపై ఆయన తీవ్ర అసంతృప్తితో ఉన్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో పార్టీ అధిష్ఠానం ఆయనకు రాజ్యసభ సీటు ఆఫర్ చేసినప్పటికీ, దానిని ఆయన తిరస్కరించారు.ఇటీవల జరిగిన ఎన్నికల్లో నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) 108 స్థానాలతో గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగా, బీజేపీ కూటమి పరిమిత స్థానాలకే పరిమితమైంది. ఈ ఫలితాల తర్వాత పార్టీ నాయకత్వంతో ఆయనకు విభేదాలు పెరిగాయి.రాజీనామా అనంతరం అన్నామలై వెంటనే కొత్త పార్టీ పెట్టే ఆలోచనలో లేరని, జాతీయవాద భావజాలంతో తొలుత ఒక ప్రజా ఉద్యమాన్ని ప్రారంభించి, భవిష్యత్తులో దానిని రాజకీయ పార్టీగా మార్చే అవకాశం ఉందని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. జూన్ 4న ఆయన పుట్టినరోజు సందర్భంగా, చెన్నైలో ఆయన మద్దతుదారులు ఇప్పటికే భారీ పోస్టర్లు ఏర్పాటు చేశారు

# రాష్ట్రాభివృద్ధే సంకల్పం

**మొదటిపేజీ తరువాయి**

సందర్భంగా మంగళవారం సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించారు. పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. కళాకారుల ప్రదర్శనలను తిలకించారు. 18 మంది పోలీసులకు, వారి కుటుంబాలకు అవార్డులను ప్రదానం చేశారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ అమరులను స్మరించుకు న్నారు. రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతూ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్, కాంగ్రెస్ అధినేత సోనియాగాం ధీకి ధన్యవాదాలు తెలిపారు.

నిర్మూలనే ప్రాధాన్యంగా ప్రజా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ఆత్మగౌరవం, స్వేచ్ఛ, సామాజిక న్యాయం కోసం పెత్తందారీ తనానికి వ్యతిరేకంగా తెలంగాణ గడ్డపై పోరాటాలు జరిగాయని గుర్తుచేశారు.రాష్ట్రంలో మహిళా సంఘాలు ఆర్థిక శక్తి కేంద్రాలుగా, ఆడబిడ్డలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే క్షేత్రాలుగా మారాయని సీఎం అన్నారు. ఇందిరా మహిళా శక్తి సూపర్ బజార్లు, లాజిస్టిక్ హబ్‌లు, గోదాములు, రైస్ మిల్లులు ఏర్పాటుకు వాళ్లు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఉచిత బస్సు ప్రయాణం ద్వారా ఆడబిడ్డలు దాదాపు రూ.10 వేల కోట్లు ఆదా చేసుకోగలిగారనీ, ఆ డబ్బులు ఆ కుటుంబాల ఆర్థిక బలోపేతం కోసం దోహదపడ్డాయని తెలిపారు. 42.90 లక్షల కుటుంబాలకు రూ.500 రూపాయలకే సిలిండర్లు, 53.09 లక్షల కుటుంబాలకు ఉచిత విద్యుత్ అందుస్తున్నామని వివరించారు. రాష్ట్రంలో 3 కోట్ల 38 వేల మందికి సన్న బియ్యం ఇస్తున్నామన్నారు.

# సీబీఎస్ఈ ఛైర్మెన్, సెక్రెటరీ బదిలీ

**న్యూఢిల్లీ :జూన్ 02,(రిపబ్లిక్ న్యూస్):** సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ) ఆన్-స్క్రీన్ మార్కింగ్ వ్యవస్థపై వివాదం రేగిన నేపథ్యంలో సీబీఎస్ఈ చెర్మెన్ రాహుల్ సింగ్, సెక్రె టరీ హిమాంశు గుప్తాలను బదిలీ చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని అధికారులు మంగళవారం తెలిపారు. అలాగే ఆన్ స్క్రీన్ మార్కింగ్ (ఓఎస్ఎం) వ్యవస్థ సేవలను సీబీఎస్ఈ తీసుకోవడంపై కూడా విచారణ జరిపేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. 2019లో తెలంగాణా ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాలపై చెలరేగిన వివాదంతో సంబంధమున్న సంస్థపై ప్రశ్నలను తాజాగా సీబీఎస్ఈ ఓఎస్ఎం వివాదం గుర్తుకు తెచ్చింది. 12వ తరగతి పరీక్షా ఫలితాలు విడుదలైన నేపథ్యంలో విద్యార్థుల జవాబు పత్రాలను మూల్యాంకన చేయడంలో తేడాలు, అలాగే రీ వాల్యూయేషన్ ప్రక్రియ సరిగా పనిచేయకపోవడంపై సీబీఎస్ఈ తీవ్ర విమర్శలను ఎదుర్కొంటోంది.తమ అంచనాలకు, తమకు వచ్చిన మార్కులకు అసలు పొంతనే లేదని విద్యార్థుల్లో భావన నెలకొన్న నేపథ్యంలో కొత్తగా ప్రవేశపెట్టిన ఓఎస్ఎం వ్యవస్థను కూడా నిశితంగా పరిశీలిస్తున్నారు. ఈ ఏడాది సీబీఎస్ఈ పాసైన శాతం 85.29శాతానికి పడిపోయింది. ఇది గతేడాది 88.39శాతంగా వుంది. అలాగే 90శాతానికి పైగా మార్కులు సాధించిన విద్యార్థుల సంఖ్య కూడా తగ్గిపోయింది.జవాబు పత్రాల కాపీలను కావాలని వేలాదిగా అభ్యర్థనలు రావడంతో ఫలితాల అనంతర వెరిఫికేషన్ పోర్టల్ కుప్పకూలింది. తమ జవాబు పత్రాలకు సంబంధించిన స్కాన్ చేసిన కాపీలను ఎవరైతే పొందగలిగారో ఆ విద్యార్థులు వాటిని చూసి షాక్‌కు గురయ్యారు. తాము జవాబు రాసిన పేజీలు అస్పష్టంగా వుండడమో లేదా కనిపించకుండా పోవడమో జరగడంతో వారు దిగ్భ్రాంతిలో వున్నారు. చాలామంది విద్యార్థులకు ఇతరుల జవాబు పత్రాలు వచ్చాయి.

# అమరావతి రైతులకు అండగా ఉంటాం

**మొదటిపేజీ తరువాయి**

ఉండాలన్నదే వైసిపి అభిమతమని చెప్పారు. ఇప్పటికే రాజధాని పేరుతో 50 వేల ఎకరాలు తీసుకున్నారని, ఇంకా 50 వేల ఎకరాలు అవసరం లేదని, అందుకే మావిగన్ ప్రతిపాదించామని పేర్కొన్నారు. ఇప్పటికే గన్నవరంలో విమానాశ్రయం ఉందని, దానికి దగ్గర్లోనే మరో ఎయిర్‌పోర్టుకు అనుమతి ఇవ్వరని చెప్పారు. పనులు ఇదే మాదిరి జరిగితే మరో 30 ఏళ్ల తరువాత కూడా రాజధాని కనిపించదన్నారు. కనీస మౌలిక వసతుల కల్పన కోసం ఎకరానికి రూ.2 కోట్లు కావాలని 12 ఏళ్ల క్రితమే బ్యాంకులకు నివేదిక ఇచ్చారని తెలిపారు. నిజానికి ఇప్పటికి ఆ రేటు పెరిగిందని, ఈ లెక్కన రోడ్లు, డ్రైనేజీ, నీరు, కరెంటు వీటిన్నింటికే ఎన్నేళ్లు ఎన్ని కోట్లు ఖర్చు చేయాలని ప్రశ్నించారు. కొండవీటి వాగుపై ఎత్తిపోతల పథకం వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని అన్నారు. వైసిపిది రైతు పక్షపాత ప్రభుత్వమని, ఇక్కడ రైతులకు నష్టం కలగ కూడదనే మావిగన్‌ను ప్రతిపాదించినట్లు పేర్కొన్నారు.అమరావతి రైతులు ఏం కావాలంటే అది చేస్తామని, బలవంతపు భూ సేకరణ ఉండదని, అవసరం అయితే, భూములు వెనక్కి ఇస్తామని జగన్ తెలిపారు. రైతుల పోరాటంలో వైసిపి న్యాయ విభాగం కూడా పాలు పంచుకుంటుందన్నారు. ఇప్పుడు చేయగలిగింది న్యాయ పోరాటం మాత్రమేనని అన్నారు. మూడేళ్ల తర్వాత వైసిపి ప్రభుత్వం ఏర్పడితే, రైతులకు పూర్తి న్యాయం చేస్తామని చెప్పారు. రైతులు భూమి ఇవ్వకపోతే, ప్లాట్లు కేటాయించి రిజిస్ట్రేషన్ చేయడం, కాలువ తవ్వడం, రోడ్లు వేయడం, తోడిన నీరు పంపింగ్ చేయడం, దగ్గర్లో రిజర్వాయర్లు ఉంటే, గండి కొట్టి, నీరు పారేలా చేయడం దారుణమని తెలిపారు. అలా దౌర్జన్యం చేసే వారికి శిక్ష పడేలా చేస్తామని వివరించారు. ఇప్పుడు తప్పు చేస్తున్న ప్రతి ఒక్కరూ మూల్యం చెల్లించేలా చేస్తామని జగన్ రైతులకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రైతు డాక్టర్ గాదె గంగాధరనాయుడు (కన్నారావునాయుడు) మాట్లాడుతూ ఉండవల్లిలో భూసమీకరణలో 1100 ఎకరాలు కావాలనుకుంటే ఇచ్చింది 250 ఎకరాలు మాత్రమే. అందులో రైతులు ఇచ్చింది 70 నుంచి 80 ఎకరాలు మాత్రమే. అక్కడ పారిశ్రామికవేత్తలు ఇచ్చిందే ఎక్కువని తెలిపారు.కరకట్టను విస్తరించుకోవచ్చని తెలిపారు

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888
బుధవారం 3 జూన్ 2026

# దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా ఇవ్వాలి

**జనాభా ప్రాతిపదికన ఎస్సీల రిజర్వేషన్ శాతాన్ని 25 గా పెంచాలి**

**ఉద్యోగుల నియామకలలో హారిజంటల్ విధానాన్ని రద్దు చేయాలి**

**జనాభా ప్రాతిపదికన ఎస్సీల రిజర్వేషన్ల 25 శాతం పెంచాలి**



**నంద్యాల, జూన్ 2, (రిపబ్లిక్ న్యూస్):** దళితులకు మత స్వేచ్ఛ కల్పిస్తూ ఏ మతాన్ని అయినా అనుసరించిన ఎస్సి హోదా రద్దు కాకుండా చర్యలు తీసుకోవాలని ఎస్సీ కమిషన్ చైర్మన్ జోహార్ కి మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం నంద్యాల జిల్లా అధ్యక్షుడు సుబ్బన్న ఆధ్వర్యంలో మంగళవారం వినతి పత్రము ఇవ్వడమైనది. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి భక్తుల రవికుమార్ జిల్లా ఉపాధ్యక్షులు వీరేష్,ప్రతాప్ జిల్లా కార్యదర్శి సోమయ్య, జిల్లా ట్రెజరర్ గుడిపల్లి సుజిత్ తదితరులు పాల్గొన్నారు. ప్రతి జిల్లా కేంద్రంలో ఎస్సీ విద్యార్థుల కొరకు స్టడీ సర్కిల్ ఏర్పాటు.( గ్రూప్–I ÊII), దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా. దళితులకు మత స్వేచ్ఛ. అన్ని ప్రభుత్వ శాఖలలో రోస్టర్ బుక్ నిర్వహణ. అన్ని ప్రభుత్వ శాఖలలో క్యాడర్ స్ట్రెంత్ ప్రకటించి, తగినంత, రిజర్వేషన్ రోస్టర్ లను పరిశీలన, అర్హత కలిగిన ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులతో భర్తీ చేయాలి. కారుణ్య నియామకాలలో ఎస్సీ అభ్యర్థులకు వెంటనే అపాయింట్మెంట్ ఉత్తర్వులు జారీ చేయాలి, ఖాళీగా ఉన్నా బ్యాక్ లాగ్ పోస్టులను వెంటనే చేపట్టాలి.ఎస్సీ విద్యార్థుల హాస్టల్ లలో మెరుగైన వసతులు కల్పించాలి. ఎస్సీ విద్యార్థుల కొరకు ప్రతి మండల కేంద్రంలో వసతి గృహాలు ఏర్పాటు చేయాలి. ఎస్సీ వర్గాల అసైన్డ్ భూములను నిషేధిత జాబితా నుండి తొలగించాలి. జి.ఓ.342 ప్రకారము ఎస్సీ ఉపాధ్యాయులు ఉన్నత విద్యను అభ్యసించడానికి అనుమతి మంజూరు చేసే అధికారము జిల్లా విద్యాశాఖ అధికారులకు అప్పగించాలి. జీవో 77 హారిజంటల్ విధానం ద్వారా ఎస్సీ అభ్యర్థులకు అన్యాయం జరుగుతుంది. ముఖ్యంగా మెరిట్ లో ఎంపికైన ఎస్సీ అభ్యర్థులను ఓపెన్ క్యాటగిరిలో కాకుండా ఎస్సీ రిజర్వేషన్ రోస్టర్ లో చూపించడం వలన ఎస్సీ అభ్యర్థులకు అన్యాయం జరుగుతుంది. జనాభా ప్రతిపదికన ఎస్సీల రిజర్వేషన్ శాతాన్ని 25 కు పెంచాలి. ఎస్సీ కమీషన్ చైర్మన్ కు పలు విధాల డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేయడం జరిగిందన్నారు.

# రాజముద్రతో రైతు పాస్ పుస్తకాల పంపిణీ ఘనంగా కార్యక్రమం నిర్వహణ

**:- రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ -రైతు గౌరవానికి రాజముద్ర.. జిల్లాడుబుడుకలలో 744 రైతు పాస్ పుస్తకాల పంపిణీ**

**దేవనకొండ, జూన్ 2( ప్రజారి పబ్లిక్ న్యూస్ ):-** రైతుల గౌరవాన్ని పునరుద్ధరించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రాజముద్ర పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో భాగంగా దేవనకొండ మండలం జిల్లాడుబుడుకల గ్రామంలో 744 మంది రైతులకు రాజముద్రతో కూడిన రైతు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ కప్పట్రాల్ల బొజ్జమ్మ చేతుల మీదుగా ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. కార్యక్రమంలో ఎంఆర్ఓ రామేశ్వర్ రెడ్డి పాల్గొని రైతులకు పాస్ పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా బొజ్జమ్మ మాట్లాడుతూ, రైతుల ఆస్తులు, హక్కులకు సంబంధించిన పాస్ పుస్తకాలపై రాజకీయ ప్రచారం చేయడం రైతుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్య అని పేర్కొన్నారు. గత ప్రభుత్వం రైతుల పాస్ పుస్తకాలపై తమ ఫోటోలను ముద్రించి వ్యక్తిగత ప్రచారానికి వేదికగా మార్చిందని విమర్శించారు. గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రైతు సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ పలు సంస్కరణలు అమలు చేస్తున్నామని తెలిపారు. అందులో భాగంగానే రాజముద్రతో కూడిన పాస్ పుస్తకాలను రైతులకు అందిస్తున్నామని పేర్కొన్నారు. రైతుల హక్కులు, గౌరవాన్ని పరిరక్షించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. రైతుల పేరుతో రాజకీయ ప్రయోజనాలు పొందేందుకు ఎవరైనా ప్రయత్నిస్తే సహించబోమని హెచ్చరించిన ఆమె, రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన అజెండా అని అన్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని తెలిపారు. దేవనకొండ మండలంలో సాగునీటి సౌకర్యాల మెరుగుదల, తాగునీటి సమస్యల పరిష్కారం, రైతు అభివృద్ధి కార్యక్రమాల అమలుపై ప్రత్యేక దృష్టి సారిస్తానని హామీ ఇచ్చారు. ప్రతి రైతు ఆత్మగౌరవంతో, ఆనందంగా జీవించేలా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. "రైతు గౌరవాన్ని కాపాడటం మా బాధ్యత... రైతు సంక్షేమాన్ని సాధించడం మా ప్రభుత్వ లక్ష్యం" అని బొజ్జమ్మ పేర్కొన్నారు.







# జిల్లాలో ఉద్యానవన పంటల విస్తీర్ణాన్ని 15 వేల హెక్టార్లకు పెంచాలి

**: కలెక్టర్ డా. ఏ. సిరి -ఈ ఏడాది 10 వేల హెక్టార్లలో డ్రిప్ ఇరిగేషన్ లక్ష్యం పూర్తి చేయాలి - పండ్ల తోటలన్నింటిలో డ్రిప్ సేద్యానికి చర్యలు**







**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 2)**
జిల్లాలో ఉద్యానవన పంటల విస్తీర్ణాన్ని 15 వేల హెక్టార్లకు పెంచేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి ఉద్యానవన శాఖ అధికారులను ఆదేశించారు. అలాగే జిల్లాలోని పండ్ల తోటలన్నింటినీ డ్రిప్ ఇరిగేషన్ కిందకు తీసుకురావాలని సూచించారు.

కర్నూలు మండలంలోని తొలిసాపురం గ్రామంలో రైతు గోవర్ధన్ రెడ్డి సాగు చేస్తున్న ఆయిల్ పామ్ తోటను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా తోటలో అమలు చేస్తున్న డ్రిప్ ఇరిగేషన్ విధానం, అంతర పంటల సాగు వివరాలను అడిగి తెలుసుకున్నారు.

డ్రిప్ ఇరిగేషన్ వ్యవస్థను ఏర్పాటు చేసుకున్న రైతులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. స్క్రీన్ ఫిల్టర్, వాల్వులు, హెడ్ కంట్రోల్ యూనిట్ (హెచ్‌సీయూ) వంటి పరికరాల వినియోగం, నిర్వహణపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే డ్రిప్ ద్వారా ఎరువుల పంపిణీ చేసే ఫెర్టిగేషన్ విధానంపై సాంకేతిక పరిజ్ఞానం అందించాలని తెలిపారు.

జిల్లాలో ఉద్యానవన పంటల సాగును మరింత విస్తరించేందుకు చర్యలు తీసుకోవాలని, కాలానుగుణ పంటలతో పాటు మామిడి, జామ, నిమ్మ వంటి దీర్ఘకాలిక తోటల పంటలను ప్రోత్సహించాలని కలెక్టర్ పేర్కొన్నారు.


ఈ పంటలన్నింటిలో డ్రిప్ ఇరిగేషన్ విధానాన్ని తప్పనిసరిగా అమలు చేయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. డ్రిప్ ఇరిగేషన్ ద్వారా నీటి పొదుపుతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ పథకాలపై రైతులకు విస్తృత అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి రైతు లబ్ధి పొందేలా చూడాలని అధికారులకు సూచించారు.


గత ఏడాది జిల్లాలో 8,260 హెక్టార్లలో డ్రిప్ ఇరిగేషన్ అమలు చేసినట్లు పేర్కొన్న కలెక్టర్, ఈ ఏడాది నిర్దేశించిన 10 వేల హెక్టార్ల లక్ష్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, డ్వామా పీడీ నరసింహారెడ్డి, ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు, ఉద్యాన శాఖ అధికారి రాధాకృష్ణారెడ్డి, ఏపీఎంఐపీ ఏపీడీ ఫిరోజ్, కర్నూలు తహసీల్దార్ రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ క్లబ్‌ఫుట్ దినోత్సవం సందర్భంగా కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో అవగాహన కార్యక్రమం

**క్లబ్‌ఫుట్ చిన్నారులకుఅందుబాటులో ఉచిత చికిత్స, ప్రత్యేక బ్రేసెస్ : ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు**








**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 2)**
ప్రపంచ క్లబ్‌ఫుట్ దినోత్సవం సందర్భంగా కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమ ప్రారంభంలో ప్రపంచ క్లబ్‌ఫుట్ దినోత్సవాన్ని పురస్కరించుకుని డాక్టర్ వెంకటేశ్వర్లు కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ క్లబ్‌ఫుట్ అనేది పుట్టుకతో వచ్చే పాదాల వైకల్యం అయినప్పటికీ, సరైన సమయంలో చికిత్స ప్రారంభిస్తే పూర్తిగా సరిచేయవచ్చని తెలిపారు.

క్యూర్ ఇండియా సంస్థ సహకారంతో క్లబ్‌ఫుట్ బాధిత చిన్నారులకు పూర్తిగా ఉచితంగా చికిత్స అందిస్తున్నామని, చికిత్స అనంతరం అవసరమైన ప్రత్యేక క్లబ్‌ఫుట్ షూస్ (బ్రేసెస్) కూడా ఉచితంగా అందజేస్తున్నామని పేర్కొన్నారు. తల్లిదండ్రులు చిన్నారుల్లో ఈ సమస్యను ముందుగానే గుర్తించి ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న వైద్య సేవలను వినియోగించుకోవాలని సూచించారు. సమాజంలో అవగాహన పెంపొందించడం ద్వారా క్లబ్‌ఫుట్ బాధిత చిన్నారులు సాధారణ జీవితాన్ని గడపగలరని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఆర్థోపెడిక్స్ విభాగాధిపతి డాక్టర్ శ్రీనివాసులు, పీడియాట్రిషియన్ డాక్టర్ సృజన, క్యూర్ ఇండియా ప్రతినిధి రెష్మా, అసోసియేట్స్, పీజీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కడుపు నొప్పి భరించలేక

## పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య



**చిప్పగిరి, జూన్, 2,( రిపబ్లిక్ న్యూస్)** చిప్పగిరి మండలం నంచర్ల గ్రామంలో బొడ్డు కడుపునొప్పి భరించలేక పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు చిప్పగిరి ఎస్సై సి .వెంకట నరసింహులు మంగళవారం విలేకరుల సమావేశంలో తెలిపారు, సోమవారం ఉదయం మృతుడి తల్లిదండ్రుల పొలం పనికి వెళ్లారని ఆ తర్వాత మధ్యాహ్నం సుమారు 3:30 నిమిషాలకు సమయంలో ఇంట్లో ఎవరు లేని సమయంలో భాస్కర్ తనకు ఉన్న బొడ్డు కడుపునొప్పి భరించలేక ఇంట్లోనే ఉన్న గాల్వన్ అనే పురుగుల మందు తాగాడని, గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అతడిని చికిత్స నిమిత్తం గుంతకల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారని, అక్కడి నుండి మెరుగైన వైద్యం కోసం అనంతపురం కిమ్స్ సవేరా హాస్పిటల్ కు తరలించారని, పరిస్థితి విష మించడంతో రాత్రి 10: 29 నిమిషాలకు మృతి చెందారని, మృతుడి తండ్రి గుడిసె హనుమంతు ఇచ్చిన రాతపూర్వక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరిగిందని, అనంతరం కేసు దర్యాప్తు చేస్తున్నామని చిప్పగిరి ఎస్సై సి.వెంకట నరసింహులు తెలిపారు.

# ఓర్వకల్లు మండల గ్రామాలలో ప్రభుత్వ పాఠశాలలో వంట చేసేవారికి ఒకరోజు శిక్షణ కార్యక్రమం

**ఓర్వకల్లు మండల విద్యాశాఖ అధికారి జి,ఓంకార్ యాదవ్**








**ఓర్వకల్లు ప్రతినిధి, జూన్ 2 (రిపబ్లిక్ న్యూస్)** మంగళవారం రోజున ఓర్వకల్లు మండలం విద్యాశాఖ అధికారి జి.ఓంకార్ యాదవ్ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల వంట తయారు చేయు (CCH) వారికి ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం ఎంఆర్సి ఓర్వకల్లు నందు నిర్వహించడం జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమంలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం రోజువారీ మెనూ ప్రకారం రుచికరంగా తయారు చేయటంలో అనుసరించవలసిన మెళు కువలను నేర్పించడం జరిగింది. వంటను గ్యాస్ మీద మాత్రమే తయారు చేయాలని మరియు నాణ్యమైన వంట నూనెను, తాజా కూరగాయలను ఉపయోగించి భోజనం తయారు చేయాలని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఓర్వకల్లు మండల విద్యాశాఖ అధికారి జి, ఓంకార్ యాదవ్, రాంభూపాల్ రెడ్డి , ఆఫీసు సిబ్బంది మరియు వివిధ పాఠశాలల వంట తయారు చేయువారు పాల్గొనడం జరిగింది.

# లబ్ధిదారుల ముంగిటకే ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు

## మానవత్వం చాటుకున్న అధికారులు



**అనంతపురం (కనేకల్) సంక్షేమం, జూన్ 02,(రిపబ్లిక్ న్యూస్):** లబ్ధిదారుల వద్దకే వెళ్లి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను కనేకల్ మండల అధికారులు పంపిణీ చేశారు. మంగళవారం జూన్ నెలకు సంబంధించిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను అర్హులైన లబ్ధిదారుల ఇంటి ముంగిటకే వెళ్లి పంపిణీ చేస్తూ ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేస్తున్నారు. మండల డిప్యూటీ ఎంపీడీవో షేక్షావలి ఆధ్వర్యంలో వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులకు మంగళవారం పెన్షన్లు పంపిణీ చేశారు. కనేకల్ మండలం బ్రహ్మసముద్రం గ్రామానికి చెందిన హరిజన సక్రప్ప అనే లబ్ధిదారుడు డయాలసిస్ చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రిలో చేరి ఉండటంతో, ఆయన పెన్షన్ పొందేందుకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. స్థానిక నాయకుడు రామప్ప సహకారంతో అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లిన అధికారులు, చికిత్స పొందుతున్న సక్రప్పకు ఎన్టీఆర్ భరోసా పథకం కింద నూతనంగా మంజూరైన రూ.10 వేల పెన్షన్‌ను నేరుగా అందజేశారు. పెన్షన్ అందుకోవడంతో లబ్ధిదారుడు, కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. లబ్ధిదారుల పరిస్థితులను గుర్తించి, వారివద్దకే వెళ్లి పెన్షన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సురేష్, వెల్ఫేర్ అసిస్టెంట్ అబ్దుల్ కరీం, ఫీల్డ్ అసిస్టెంట్ శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# చేపల ఉత్పత్తి లక్ష్యాల సాధనకు చర్యలు వేగవంతం చేయాలి: కలెక్టర్ డా. ఏ. సిరి

**సుంకేసుల డ్యాం చేపల విత్తనోత్పత్తి కేంద్రం పరిశీలన**

**డీసిల్టింగ్, జంగిల్ క్లియరెన్స్ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశం**



**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 2)**
జిల్లాలో ఈ ఏడాది చేపల ఉత్పత్తి పెంపుదలకు నిర్దేశించిన లక్ష్యాలను తప్పనిసరిగా సాధించేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. సుంకేసుల డ్యాం వద్ద ఉన్న చేపల విత్తనోత్పత్తి (సీడ్ ప్రొడక్షన్) కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రంలోని మౌలిక సదుపాయాలు, ఉత్పత్తి సామర్థ్యం, చేపల పెంపకానికి చేపట్టిన ఏర్పాట్లపై మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ రంగనాథ్ బాబు నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. చేపల పెంపక చెరువులు, హ్యాచింగ్ పూల్స్, ఆర్‌సీసీ ట్యాంకుల పనితీరు, విత్తనోత్పత్తి లక్ష్యాలు మరియు ప్రస్తుత పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి చేపల విత్తనోత్పత్తి లక్ష్యాలను గణనీయంగా పెంచిన నేపథ్యంలో లక్ష్య సాధనకు అవసరమైన అన్ని చర్యలను సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ సూచించారు. కేంద్ర పరిధిలోని చెరువుల్లో పేరుకుపోయిన పూడిక తొలగింపు (డీసిల్టింగ్), పొదలు మరియు కలుపు మొక్కల తొలగింపు (జంగిల్ క్లియరెన్స్) అవసరాన్ని మత్స్యశాఖ అధికారులు ఆమె దృష్టికి తీసుకెళ్లగా, ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను సిద్ధం చేసి సమర్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, మత్స్యశాఖ డీడీ రంగనాథ్ బాబు, కర్నూలు రూరల్ తహసీల్దార్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# రెసిడెన్షియల్ విద్యాసంస్థలను నెట్ జీరో అండ్ హెల్తీ క్యాంపస్‌లుగా తీర్చిదిద్దాలి

## పర్యావరణ పరిరక్షణ, హరితాభివృద్ధితోనే స్థిరమైన ఆర్థికాభివృద్ధి సాధ్యం -జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి

**నంద్యాల బ్యూరో, జూన్ 02( రిపబ్లిక్ న్యూస్):** ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెసిడెన్షియల్ విద్యాసంస్థలు, ఆశ్రమ పాఠశాలలు, కేజీబీవీలు, హాస్టళ్లను రాబోయే రెండేళ్లలో "నెట్ జీరో అండ్ హెల్తీ క్యాంపస్ లు"గా అభివృద్ధి చేసి పర్యావరణ పరిరక్షణకు ఆదర్శంగా నిలపాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు. పర్యావరణ సమతుల్యత, కార్బన్ ఉద్గారాల తగ్గింపు, విద్యార్థుల్లో ప్రకృతి పట్ల బాధ్యతా భావం పెంపొందించడం ద్వారా స్థిరమైన అభివృద్ధి సాధ్యమవుతుందని ఆమె అన్నారు. మంగళవారం జిల్లా హెచ్ఆర్డీ కేంద్రంలో నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన మార్గదర్శకాల మేరకు పర్యావరణ పరిరక్షణ, హరితావరణ విస్తరణ, సూక్ష్మ వాతావరణ మెరుగుదల, కార్బన్ తగ్గింపు లక్ష్యాలతో అల్ట్రా హై డెన్సిటీ (యూహెచ్‌డీ) ప్లాంటేషన్ – అనంత అరణ్య మోడల్‌ను అమలు చేయనున్నట్లు తెలిపారు. మహాత్మా




గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) మరియు వీబీ–గ్రామ్ జి ద్వారా జిల్లాలోని రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో ఈ కార్యక్రమాన్ని ముమ్మరంగా చేపట్టాలని కలెక్టర్ వివరించారు. మొక్కలు నాటడం అంటే కేవలం హరిత కార్యక్రమం కాదని, భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించే సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. పచ్చదనం పెరగడం ద్వారా గాలి నాణ్యత మెరుగుపడి ప్రజారోగ్యానికి మేలు జరగడమే కాకుండా, ఉత్పాదకత పెరిగి ఆర్థికాభివృద్ధికి కూడా దోహదపడుతుందని తెలిపారు. మొక్కల పెంపకం వల్ల నేల సారవంతం పెరగడం, భూగర్భ జలాల నిల్వలు మెరుగుపడడం, పర్యావరణ సమతుల్యత నెలకొనడం, విద్యార్థుల్లో ప్రకృతి పట్ల అనుబంధం పెరగడం వంటి అనేక ప్రయోజనాలు ఉంటాయని చెప్పారు. "వేస్ట్ టు వెల్త్" భావనను ప్రతి విద్యాసంస్థలో ఆచరణలోకి తీసుకురావాలని సూచించారు. సర్క్యులర్ ఎకానమీ ద్వారా వ్యర్థాలను సంపదగా మార్చే విధానాలపై అవగాహన పెంపొందించాలని పేర్కొన్నారు. ఈ సృష్టిలో ఏదీ వ్యర్థం కాదని, ప్రతి వనరును పునర్వినియోగం చేస్తూ గరిష్ఠ ప్రయోజనం పొందడమే సుస్థిర అభివృద్ధి లక్ష్యమని వివరించారు. జిల్లాలో మట్టి సారవంతం పెంపు కోసం బయోచార్ వినియోగాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ఆమె తెలిపారు. వ్యవసాయ వ్యర్థాలు, కొబ్బరి బోండాలు వంటి పదార్థాలతో తయారుచేసే బయోచార్ నేలలో కార్బన్ శాతాన్ని, గుల్లదనాన్ని పెంచి దిగుబడులు మెరుగుపరుస్తుందని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా కార్బన్ క్రెడిట్ ట్రేడింగ్‌కు పెరుగుతున్న ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని రైతులు సరికొత్త అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. సాంప్రదాయ వ్యవసాయ పద్ధతులతో పాటు అధిక ఆదాయాన్ని అందించే ఉద్యాన పంటలు, ఆధునిక సాంకేతిక వ్యవసాయ విధానాల వైపు రైతులు అడుగులు వేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో డ్రాగన్ ఫ్రూట్, అవకాడో, ఖర్జూరం, మెకాడమియా నట్స్, చామంతి వంటి అధిక విలువ కలిగిన పంటల సాగుతో రైతులు విశేష లాభాలు పొందుతున్నారని తెలిపారు. జిల్లా స్థూల ఆర్థికోత్పత్తి (జీడీపీ) పెరుగుదలలో హార్టికల్చర్, పశుసంవర్ధక రంగాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. సహజ వనరులు సమృద్ధిగా ఉన్న నంద్యాల జిల్లాలో వ్యవసాయ అనుబంధ రంగాల ద్వారా మరింత ఆర్థికాభివృద్ధి సాధించే అవకాశాలు ఉన్నాయని అన్నారు. పర్యావరణ పరిరక్షణ, ఆధునిక వ్యవసాయం, సహజ వనరుల సమర్థ వినియోగం ద్వారా జిల్లా అభివృద్ధిని మరింత వేగవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల రెసిడెన్షియల్ పాఠశాలల ప్రిన్సిపాళ్లు, కేజీబీవీ ప్రత్యేక అధికారులు, హాస్టల్ సంక్షేమ అధికారులు, సంబంధిత జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## మాంచో ఫెర్రర్‌ను కలిసిన రవికుమార్ కుటుంబ సభ్యులు

### రవికుమార్ కుటుంబానికి ఆర్డీటీ భరోసా - రవి పిల్లలకు ఉచిత విద్య అందిస్తామని హామీ



**అనంతపురం ప్రతినిధి, జూన్ 02,(రిపబ్లిక్ న్యూస్ ):** ఇటీవల అకాల మరణం చెందిన ఆంధ్రజ్యోతి అనంతపురం రిపోర్టర్ రవికుమార్ కుటుంబానికి ఆర్డీటీ అండగా నిలిచింది. రవికుమార్ భార్య, పిల్లలు సోమవారం ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మంచో ఫెర్రర్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (ఏపి డబ్ల్యూజేఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి రేపటి రామాంజనేయులు రవికుమార్ మృతితో కుటుంబం ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను మాంచో ఫెర్రర్ దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా రవి నలుగురు పిల్లల భవిష్యత్ విద్యాభ్యాసంపై ఆందోళన వ్యక్తం చేస్తూ, వారికి ఆర్డీటీ ద్వారా ఉచిత విద్యా సదుపాయం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మాంచో ఫెర్రర్, రవికుమార్ నలుగురు పిల్లలకు ఆర్డీటీ సంస్థ ద్వారా ఉచిత విద్య అందించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ నిర్ణయం కుటుంబ సభ్యులకు ధైర్యాన్ని నింపడంతో పాటు జర్నలిస్టు వర్గాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. ఈ సందర్భంగా ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు డాక్టర్ సూర్య, జయప్రకాశ్, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

## టమోటా చెట్లు ధ్వంసం

### రూ. 3 లక్షల ఆస్తి నష్టం

**చౌడేపల్లి ప్రతినిధి జూన్ 02 రిపబ్లిక్ న్యూస్**



టమోటా చెట్లు ధ్వంసం చేసి రూ 3 లక్షల ఆస్తి నష్టం సంబంధించిన సంఘటన చౌడేపల్లి మండలంలో చోటుచేసుకుంది బాధితురాలు కథనం మేరకు... మండలంలోని వెంగళపల్లి పంచాయతీ దాసరయ్య గారి పల్లి చందన అంజలి కి గ్రామానికి సమీపంలో పొలం ఉంది. ఆ పొలంలో ఎకరా వరకు టమోటా పంట సాగులో ఉంది రెండు రోజుల్లో తొలి విడత టమోటా ను మార్కెట్కు తరలించాల్సి ఉంది అయితే గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం రాత్రి టమోటా పొలంలో మద్యం సేవించి పొలంలో ఉన్న 5 వేల టమాటా మొక్కలను ధ్వంసం చేశారని బాధితురాలు వాపోయింది. ఆరుకాలం శ్రమించి దాదాపు రూ 1.5 లక్షల వరకు ఖర్చు చేసి మార్కెట్కు తరలించే సమయంలో ధ్వంసం చేశారని మహిళా రైతు వాపోయింది. ఈ మేరకు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆమె తెలిపింది.

## బదిలీ అయిన పోలీసులకు ఘన వీడ్కోలు



**చౌడేపల్లి ప్రతినిధి జూన్ 02 రిపబ్లిక్ న్యూస్**

మండల కేంద్రమైన చౌడేపల్లి నుంచి బదిలీపై వెళ్తున్న ఆరుగురు పోలీసులను ఘనంగా సన్మానించారు వీడ్కోలు పలికారు. పుంగనూరు రూరల్ సీఐ సాయి ప్రసాద్ ఆధ్వర్యంలో ఎస్సై చిన్నరెడ్డప్ప ఆరుగురిని ఘనంగా సన్మానించారు చౌడేపల్లి మండలం అన్నమయ్య జిల్లాలో ఉండడంతో చిత్తూరు జిల్లాకు చెందిన ఈ ఆరుగురిని వారి జిల్లాకు బదిలీ చేశారు ఈ మేరకు ఎస్ఐ చిన్న రెడ్డప్ప వారందరని పూలమాలవేసి దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# అన్ని వర్గాలు ప్రజలకూ.. 'కూటమి వెన్నుపోటు'

### రెండేళ్లలో కూటమి ప్రభుత్వం చేసింది శూన్యం ఎక్కడ చూసినా అవినీతి, అక్రమాలు, భూదందాలు దౌర్జన్యాలు

### జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి స్పష్టీకరణ

### "వెన్నుపోటుకు రెండేళ్లు" పోస్టర్ ను పార్టీ శ్రేణులతో కలిసి ఆవిష్కరించిన అనంత, నరేష్ కుమార్ రెడ్డి






**అనంతపురం సంక్షేమం, జూన్ 02,(రిపబ్లిక్ న్యూస్ ):** గత వైయస్సార్ కాంగ్రెస్ పాలన కంటే రెట్టింపు సంక్షేమాన్ని అందిస్తామంటూ ఎన్నికల సమయంలో ప్రజలను నమ్మించి ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలకు కూటమి ప్రభుత్వం వెన్నుపోటు పొడిచిందని అనంతపురం జిల్లా వైయస్సార్ సీపీ అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి విమర్శించారు. మంగళవారం అనంతపురం జిల్లా కేంద్రంలోని వైయస్సార్ సీపీ పార్టీ కార్యాలయంలో వైయస్సార్ సీపీ శ్రేణులతో కలసి పార్టీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, పార్లమెంట్ పరిశీలకులు నరేష్ కుమార్ రెడ్డి లు "వెన్నుపోటు కు రెండేళ్లు" పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ తో పాటు ఇతర హామీలను అమలు చేయకుండా కేవలం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ రెండేళు కాలయాపన చేసారని విమర్శించారు. అనంతపురం సహా రాష్ట్రంలో ఎక్కడ చూసినా అవినీతి, అక్రమాలు, దౌర్జన్యాలు, భూ ఆక్రమణలే కనిపిస్తున్నాయని మండిపడ్డారు. అభివృద్ధి, సంక్షేమం రెండింటిని విస్మరించి ప్రజలకు వెన్నుపోటు పొడుస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం వెన్నుపోటు పాలనకు నిరసనగా జూన్ 04వ తేదీ నుండి 12వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలియజేసారు. పార్టీ శ్రేణులు నిరసన కార్యక్రమాల్లో పాల్గొని ప్రజల్లో చైతన్యం నింపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు నేతలు పాల్గొన్నారు.

# పోలీస్ కుటుంబాలకు ఉచిత నేత్ర వైద్య సేవలు

### జిల్లా ఎస్పీని కలిసిన విజన్ ప్లస్ ఐ హాస్పిటల్ ప్రతినిధులు

**శ్రీ సత్యసాయి /కదిరి/పుట్టపర్తి, జూన్ 02,(రిపబ్లిక్ న్యూస్):** సత్యసాయి జిల్లా పోలీసు శాఖ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు నాణ్యమైన నేత్ర వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడానికి విజన్ ప్లస్ కంటి ఆసుపత్రి ముందుకొచ్చింది. ఆరోగ్య భద్రత పథకం ద్వారా కంటి సంబంధిత వైద్య సేవలను ఉచితంగా అందించనున్నట్లు ఆసుపత్రి మేనేజింగ్ పార్ట్‌నర్ శాలి దాదా గాంధీ తెలిపారు. ఈ మేరకు మంగళవారం సత్యసాయి జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వివరాలను వివరించారు. పోలీసు ఉద్యోగులు విధి నిర్వహణలో నిరంతరం ఒత్తిడితో పాటు ఎక్కువ సమయం కంప్యూటర్లు, డిజిటల్ పరికరాలతో గడపాల్సి వస్తోందని, దీంతో కంటి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని ఈ సందర్భంగా చర్చించారు. ఈ నేపథ్యంలో పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు ఆరోగ్య భద్రత పథకం కింద సమగ్ర నేత్ర వైద్య సేవలను అందించేందుకు విజన్ ప్లస్ కంటి ఆసుపత్రి ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలో తొలిసారిగా పోలీసు శాఖకు చెందిన ఉద్యోగులు, వారి కుటుంబాల కోసం ప్రత్యేకంగా నేత్ర



వైద్య సేవలను ఉచితంగా అందిస్తున్నామని శాలి దాదా గాంధీ పేర్కొన్నారు. సాధారణ కంటి పరీక్షల నుంచి క్లిష్టమైన నేత్ర సమస్యల గుర్తింపు, వైద్య సలహాలు, అవసరమైన చికిత్సల వరకు అన్ని సేవలు పథకం పరిధిలో అందుబాటులో ఉంటాయని వివరించారు. ప్రస్తుత కాలంలో చిన్నారుల నుంచి వృద్ధుల వరకు కంటి సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో ముందస్తు పరీక్షలు, సరైన చికిత్స ఎంతో అవసరమని తెలిపారు. కంటి చూపు మందగించడం, కంటిలో మంట, నీరు కారడం, తలనొప్పి, మధుమేహం కారణంగా వచ్చే నేత్ర సమస్యలు వంటి వాటిని ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స అందించడం ద్వారా పెద్ద సమస్యలను నివారించవచ్చన్నారు.

**ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి**

ఈ సందర్భంగా ఎస్పీ సతీష్ కుమార్‌కు పథకం అమలు విధానం, పోలీసు సిబ్బంది పొందే ప్రయోజనాలు, ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న ఆధునిక వైద్య సదుపాయాల గురించి వివరించారు. పోలీసు శాఖ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని కంటి ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని కోరారు. కదిరి పట్టణంలోని సైదాపురంలో ఉన్న విజన్ ప్లస్ కంటి ఆసుపత్రి ద్వారా ఈ సేవలు అందించబడతాయని, సత్యసాయి జిల్లాలో ఆరోగ్య భద్రత పథకం కింద నేత్ర వైద్య సేవలను అందిస్తున్న తొలి ఆసుపత్రిగా విజన్ ప్లస్ నిలుస్తోందని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ఉచిత నేత్ర వైద్య శిబిరాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు చేరువయ్యేలా చర్యలు చేపడతామని వెల్లడించారు.

# మున్సిపల్ షాపులకు వెంటనే వేలంపాటలు నిర్వహించాలి

### ఆక్రమణలు తొలగింపు, బకాయిదారుల షాపుల సీజ్‌కు కమిషనర్ చల్లా ఓబులేసు ఆదేశాలు

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 2)** నగరపాలక సంస్థకు చెందిన షాపింగ్ కాంప్లెక్స్‌లలో ఖాళీగా ఉన్న దుకాణాలకు వెంటనే వేలంపాటలు నిర్వహించాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు అధికారులను ఆదేశించారు. రెవెన్యూ విభాగ అధికారులతో కలిసి పెద్ద మార్కెట్, కొండారెడ్డి బురుజు, కంట్రోల్ రూం, మద్దూర్‌నగర్, వినాయకఘాట్, గాంధీనగర్, సి.క్యాంపు ప్రాంతాల్లోని మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా 25 సంవత్సరాల లీజు కాలం పూర్తయిన మున్సిపల్ షాపులకు తక్షణమే వేలంపాటలు నిర్వహించాలని కమిషనర్ ఆదేశించారు. లీజుదారులు రహదారులపై చేపట్టిన అక్రమ నిర్మాణాలు, ఇతర ఆక్రమణలను పట్టణ ప్రణాళిక విభాగం అధికారుల సమన్వయంతో తొలగించాలని సూచించారు. దీర్ఘకాలంగా అద్దె బకాయిలు



చెల్లించని లీజుదారుల షాపులను సీజ్ చేయాలని స్పష్టం చేశారు. లీజు కాలం ముగిసిన తర్వాత కూడా షాపులను వినియోగిస్తున్నవారి నుంచి అదనపు కాలానికి సంబంధించిన అద్దెను వసూలు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. వేలంపాట ద్వారా షాపులు కేటాయించుకున్నప్పటికీ వాటిని స్వాధీనం చేసుకోకుండా, అద్దెలు చెల్లించకుండా ఉన్న లీజుదారులకు నోటీసులు జారీ చేసి, అవసరమైతే తిరిగి వేలంపాట నిర్వహించాలని



ఆదేశించారు. మున్సిపల్ ఆస్తుల పరిరక్షణతో పాటు సంస్థ ఆదాయ వృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని రెవెన్యూ అధికారులకు సూచించారు.

ఈ తనిఖీల్లో అదనపు కమిషనర్ ఆర్.జి.వి. కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్‌కుమార్ రెడ్డి, ఆర్వోలు జునైద్, స్వర్ణలత, వాజిద్, ఆర్ఐలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా రిపబ్లిక్
బుధవారం 3 జూన్ 2026

# దేశ సమగ్రత కోసం పని చేసే వ్యక్తి డిప్యూటీ సీఎం కొణిదల పవన్ కళ్యాణ్.

**కుల, మత, ప్రాంతాలకు అతీతంగా గట్టిగా నిలబడే వ్యక్తి...**

**గుంతకల్ నియోజకవర్గం జనసేన పార్టీ సమన్వయకర్త వాసగిరి మణికంఠ.**




**గుత్తి జూన్ 02 రిపబ్లిక్ న్యూస్**

గత కొన్ని రోజులుగా జనసేన అధినేత శ్రీ కొణిదల పవన్ కళ్యాణ్ ను ఉద్దేశిస్తూ ప్రాంతాల మధ్య విద్వేషాలు, కులాల మధ్య వైర్యంయాలు పెడుతున్న తీరును ఖండించేందుకు గుంతకల్ నియోజకవర్గం జనసేన పార్టీ సమన్వయకర్త వాసగిరి మణికంఠ ఆధ్వర్యంలో గుత్తి పట్టణంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో మంగళవారం మీడియా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా వాసగిరి మణికంఠ మరియు జనసేన పట్టణ, మండల నాయకులు మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఎదుగుదలను ఓర్వలేక ఆయనను టార్గెట్ చేస్తూ ఇంత ద్వేషమా, ఇంత పగా, ఇంత అసూయా... తమ రాజకీయ ఎదుగుదలకి అడ్డు వస్తున్నాడని ఒక్క మనిషి మీద ఇంత మంది కలసి ఇలా విషం కక్కడం బహుశా దేశ రాజకీయాలలో ఇదే ఏమో. పవన్ కళ్యాణ్ గారిని ఒక కులానికి ఆపాదిస్తున్నారు. డిప్యూటీ సీఎం గా పవన్ కళ్యాణ్ వేయిస్తున్న రోడ్డు మీద ఒక్క కులమే నడుస్తున్నదా. పవన్ తీసుకొచ్చిన పర్యావరణ సంస్కరణలు వలన ఒక్క కులమే లాభపడుతుందా. అటవీ శాఖ లో పవన్ తీసుకొచ్చిన పెను మార్పు వలన ఒక్క కులానికే ఉపయోగమా, పంచాయితీ రాజ్ లో తాను తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పు ఒక్క కులానికే ఉపయోగమా అని ప్రశ్నించారు. ప్రొఫెసర్ నాగేశ్వర రావు తను నోరు జారాడు, క్షమించాలని కోరాడు. అయిపోయింది. కాని దానికి ప్రాంతాన్ని అంటగట్టి పవన్ మీద విద్వేషం. తెలంగాణా లో కొంతమంది వచ్చేసి పవన్ ని తిరగనివ్వము, పవన్ తెలంగాణా కి ద్రోహి అని మొదలెట్టారు. ఎంత దారుణం? తెలంగాణా ప్రజలకి పవన్ ఎన్ని సహాయాలు చేశాడు, మొన్నటికి మొన్న కొండగట్టు దేవాలం అభివృద్ధికి పవన్ చూపించిన చొరవ, వరదల సమయంలో కోటి రూపాయల సహాయం, తెలంగాణ ఏజెన్సీ ఏరియాలో నీటి సమస్యను తీర్చిన విధానం అందరికీ తెలిసిందే. ఒక్కరి ని ధైర్యం గా ఎదుర్కొనే దమ్ము లేక ఇలా నీచానికి దిగజారాలా. రాజకీయాలలో కొన్ని కుటుంబాలు మాత్రమే ఉండాలా. అదేదో వారి జన్మ హక్కులా ఫీల్ అయిపోయి సామ్యులు ఎవరు వచ్చినా వారిని నాశనం చేసే దాకా నిద్రపోరు. సొంత డబ్బులతో ఎన్నో సేవాకార్యక్రమాలు చేసిన చిరంజీవిగారు రాజకీయ సన్యాసం తీసుకునే దాకా విషం చిమ్ముతానే ఉన్నారు. కానీ ధర్మరాజు లాంటి చిరంజీవి కాదు ఇక్కడ ఉండేది విశ్వ విజేతగా నిలిచే అర్జునుడు లాంటి వ్యక్తి కొణిదల పవన్ కళ్యాణ్ అని ఇంకొక సారి ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని గట్టిగా హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో గుత్తి పట్టణ, మండల అధ్యక్షులు చిన్న వెంకటేశులు, పాటిల్ సురేష్ వీరమహిళ రాజేశ్వరి జనసేన పార్టీ సీనియర్ నాయకులు బోయ గడ్డ బ్రహ్మయ్య, గోరంట్ల నాగయ్య రాయల్, వెంకటపతి నాయుడు, ఓబులేసు, అశ్వ నాగప్ప, హసన్, ధను, గద్దల కార్తీక్, ఫిరోజ్ నాయక్, రమేష్, రవి ప్రకాష్, గాజుల రాఘవేంద్ర, కథల వీధి అంజి, సుంకర నాగరాజు, రామాంజనేయులు యాదవ్, విజయ్, అమర్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛతకు సహకరించకుంటే ట్రేడ్ లైసెన్స్ రద్దు

**: కమిషనర్ చల్లా ఓబులేసు హెచ్చరిక**

**డస్ట్‌బిన్‌లు లేని రెండు దుకాణాలకు జరిమానా..**

**అపరిశుభ్రత కొనసాగితే దుకాణాల సీజ్‌కు హెచ్చరిక..**

**శానిటేషన్ డివిజన్లు సమన్వయంతో పనిచేయాలని ఆదేశం**





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 2)**

నగరంలోని వ్యాపారులు పరిసరాల పరిశుభ్రత విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ట్రేడ్ లైసెన్సులు రద్దు చేయడంతో పాటు అవసరమైతే దుకాణాలను సీజ్ చేస్తామని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు హెచ్చరించారు. పాత బస్టాండ్, సుంకేసుల రోడ్డు, ఎన్.ఆర్.పేట ప్రాంతాల్లో పారిశుధ్య పనులను ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. షరాఫ్ బజార్ వెనుక భాగంలో రెండు దుకాణాల వద్ద అపరిశుభ్ర వాతావరణం నెలకొనడం, డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేయకపోవడంపై కమిషనర్ అసహనం వ్యక్తం చేశారు. వెంటనే ఆయా దుకాణాలకు జరిమానా విధించాలని శానిటేషన్ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. టీ బంకులు, పాన్ షాపుల నిర్వాహకులు తప్పనిసరిగా పెద్ద పరిమాణంలో డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

వాటర్ ట్యాంక్ పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తను రహదారులపై వేయడాన్ని తీవ్రంగా తప్పుబట్టిన కమిషనర్, చెత్తను మున్సిపల్ వాహనాలకు మాత్రమే అప్పగించాలని సూచించారు. రోడ్లపై చెత్త వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మూడు శానిటేషన్ డివిజన్ల సరిహద్దు ప్రాంతంలోని కూడలిలో చెత్తాచెదారం పేరుకుపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేసిన ఆయన, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు పరస్పర సమన్వయంతో పనిచేసి సరిహద్దు ప్రాంతాల్లో కూడా పారిశుధ్య నిర్వహణను మెరుగుపరచాలని ఆదేశించారు.

సుంకేసుల రోడ్డులో రైల్వే ట్రాక్ ఇరువైపులా ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టి నగర ప్రవేశ ద్వారాన్ని ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.

అనంతరం కలెక్టరేట్‌లోని అన్న క్యాంటీన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన కమిషనర్, సిబ్బంది కొరతతో పాటు పరిశుభ్రత లోపాలపై ఆగ్రహం వ్యక్తం చేసి సంబంధిత అధికారులకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు మూర్తుజావలి, లోకేష్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

# అరుదైన వ్యాధితో యువకుడి పోరాటం

## దాతల సాయం కోసం పేద కుటుంబం వేడుకోలు





**అనంతపురం ప్రతినిధి, జూన్ 02,( రిపబ్లిక్ న్యూస్ ):**

ఇంటికి పెద్ద దిక్కుగా నిలిచిన కొడుకు ఇప్పుడు మంచాన పడిపోవడంతో ఓ నిరుపేద కుటుంబం దిక్కుతోచని స్థితిలో కన్నీరు మున్నీరవుతోంది. తండ్రిని కోల్పోయిన బాధ నుంచి ఇంకా తేరుకోకముందే కుటుంబ భారాన్ని మోసిన యువకుడు అరుదైన వ్యాధి బారిన పడటంతో ఆ కుటుంబం జీవితమే అగమ్యగోచరంగా మారింది. దాతల సహాయం కోసం ఆ కుటుంబం ఎదురుచూస్తోంది.

అనంతపురం జిల్లా పామిడి మండలం వెంగంనాయుడు కాలనీకి చెందిన మహమ్మద్ ఫారూఖ్ గత కొంతకాలంగా తీవ్రమైన పేగు సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. వ్యాధి తీవ్రంగా ఉండటంతో వైద్యులు పెద్దపేగులోని దెబ్బతిన్న భాగాన్ని శస్త్రచికిత్స ద్వారా తొలగించారు. ప్రస్తుతం శరీరం నుంచి వ్యర్థాలు బయటకు వెళ్లేందుకు పొట్ట భాగంలో ప్రత్యేక సంచిని ఏర్పాటు చేయాల్సి వచ్చింది. ఇప్పటికే మూడు సార్లు శస్త్రచికిత్సలు చేయించుకున్న ఫారూఖ్ ఆరోగ్య పరిస్థితి ఇంకా పూర్తిగా మెరుగుపడలేదు.

**కుటుంబానికి ఆధారం .. ఇప్పుడు మంచానికే పరిమితం**

గతంలో ప్రముఖ ఈ-కామర్స్ సంస్థలో డెలివరీ ఉద్యోగిగా పనిచేసిన ఫారూఖ్ కుటుంబ పోషణ బాధ్యతలను భుజాన వేసుకున్నాడు. వృద్ధ తల్లి, ఇద్దరు చెల్లెళ్లకు అండగా నిలిచిన అతడు సంపాదించిన ఆదాయంతోనే కుటుంబం నెట్టుకొచ్చేది. అయితే అనారోగ్యం కారణంగా ఉద్యోగం చేయలేని స్థితికి చేరుకోవడంతో కుటుంబం ఆర్థికంగా కుదేలైంది. ఇంకా విషాదకర విషయం ఏమిటంటే, కేవలం ఏడు నెలల క్రితమే ఫారూఖ్ తండ్రి మరణించారు. దీంతో కుటుంబానికి ఉన్న ఒకేఒక్క ఆధారం ఫారూఖ్ మాత్రమే. ఇప్పుడు అతడే మంచాన పడిపోవడంతో తల్లి, చెల్లెళ్లు తీవ్ర ఆందోళనలో ఉన్నారు.

**మరో శస్త్రచికిత్సకు రూ.6 లక్షలు అవసరం**

ఫారూఖ్ పూర్తిగా కోలుకోవాలంటే మరో కీలక శస్త్రచికిత్స చేయాల్సి ఉంటుందని వైద్యులు సూచించారు. ఈ ఆపరేషన్‌కు రూ.5 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు ఖర్చవుతుందని అంచనా వేశారు. ఇప్పటికే మూడు ఆపరేషన్ల కోసం కుటుంబం చేతిలో ఉన్న ఆస్తిపాస్తులన్నీ ఖర్చు చేసింది. అప్పులు కూడా పెరిగిపోయాయి. ఇప్పుడు అంత పెద్ద మొత్తాన్ని సమకూర్చే పరిస్థితి తమకు లేదని కుటుంబ సభ్యులు వాపోతున్నారు. దాతలు ఎవరైనా ముందుకు వచ్చి సహాయం చేస్తే మా అన్నయ్యకు ఆపరేషన్ జరిగి మళ్లీ సాధారణ జీవితంలోకి వస్తాడు" అని ఫారూఖ్ సోదరి కన్నీటి పర్యంతమైంది. తన కొడుకును కాపాడాలని, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఆర్థిక సహాయం అందించాలని ఫారూఖ్ తల్లి చేతులు జోడించి వేడుకుంటున్నారు.

# బాటలో సుంకలమ్మ దేవర మహోత్సవానికి హాజరైన జనసేన నేత వాసగిరి మణికంఠ.



**గుత్తి జూన్ 02 రిపబ్లిక్ న్యూస్**

గుంతకల్ పట్టణ వాసి అనిల్ రాయల్ గుత్తి మండలం, బాట సుంకలమ్మ దేవాలయం యందు నిర్వహించిన దేవర కార్యక్రమానికి వారి ఆహ్వాన మేరకు గుంతకల్ నియోజకవర్గం జనసేన పార్టీ సమన్వయకర్త వాసగిరి మణికంఠ పాల్గొన్నారు. ముందుగా బాట సుంకులమ్మ అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారి అతిథ్యాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గుత్తి పట్టణ జనసేన పార్టీ అధ్యక్షులు పాటిల్ సురేష్ సీనియర్ నాయకులు గాజుల రాఘవేంద్ర, కథల వీధి అంజి, సుంకర నాగరాజు, అమర్, ధోనిముక్కల విజయ్, రామాంజనేయులు యాదవ్, హసన్ భాష, ఆముదాల రమేష్, గోవర్ధన గిరిధర్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

# మెదక్ కలెక్టరేట్లో శివాని గురువుదంఆధ్వర్యంలో నటరాజ విద్యార్థుల కళాతోరణం ప్రదర్శన



**మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 2 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మెదక్ జిల్లా కలెక్టర్ ఆవరణంలో నిర్వహించిన జాతీయ జెండా ఆవిష్కరణ అనంతరం మినీ కలెక్టర్ ప్రాంగణంలో నిర్వహించిన శివాని గురువుగారి ఆధ్వర్యంలో నటరాజ కళాతోరణం ఆధ్వర్యంలో చక్కటి నాట్య ప్రదర్శనను తెలంగాణ సాంప్రదాయ ప్రకారం చక్కటి ప్రదర్శనను చేసి చూపించి అందరిని ఉత్సాహంగా ఉల్లాసంగా అలరించిన విద్యార్థులను అధికారులు అభినందించి విద్యార్థులకు సన్మాన కార్యక్రమం ఇంత కార్యక్రమాన్ని విజయవంతం చేయించిన కళ బృందం గురువుని శివానిని అధికారులు అభినందించారుతెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మెదక్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగినటువంటి కార్యచరణలో భాగంగా నటరాజ కళాతోరణం విద్యార్థులు చక్కటి ప్రదర్శన ప్రదర్శించారు

# వై కోటలో మహిళల భద్రతపై అవగాహన సదస్సు

## - సిఐ శ్రీనివాసులు



**రైల్వే కోడూరు జూన్ 2 రిపబ్లిక్ న్యూస్.**

మహిళలు ప్రస్తుత సమాజంలో జీవన విధానంలో అప్రమత్తంగా ఉండాలని రైల్వేకోడూరు రూరల్ సిఐ. శ్రీనివాసులు అన్నారు మంగళవారం ఓబులవారిపల్లి మండలం వైకోట గ్రామంలో నిర్వహించిన మహిళల భద్రతపై అవగాహన సదస్సులో మహిళలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ మీ. భద్రతే మా బాధ్యత అని మహిళలు కుటుంబ విలువలను కాపాడుకోవాలని సైబర్ నేరాల ఉచ్చులో పడవద్దని. ఏవైనా ఫోన్లు గుర్తుతెలియని వ్యక్తులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనడం ఎంతో సంతోషకరమని పోలీసులు సూచిస్తున్న పలు సలహాలు సూచనలు పాటించాలని. ఆయన సూచించారు అంతేకాకుండా సైబర్ నేరాలు ఉచ్చులో పడకుండా ఎవరికంటే వారికి ఫోన్లు మిస్ కాల్ వచ్చినప్పుడు వారికి రెస్పాండ్ కాకుండా మహిళలు జాగ్రత్త వహించాలని ఎవరైనా మిస్ బిహేవ్ చేస్తే వారి గురించి పోలీసులకు తెలిపి. మీ భద్రతకు భంగం కలవకుండా జాగ్రత్త వహించాలని పోలీసులు అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుని ఆ విషయాలను గోప్యంగా ఉంచుతారని ఆయన అన్నారు,అనంతరం ఎస్సై మహేష్ నాయుడు మాట్లాడుతూ అధిక సంఖ్యలో డ్వాక్రా మహిళలు వైద్య సిబ్బంది వెలుగు సిబ్బంది మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో మంచిది అని ప్రతి ఒక్కరు భద్రత పైన అవగాహన కలిగి ఉంటే దారి పొడువున నడిచేవారు వారి మెడలో గొలుసులు లాక్కొని వెళ్లడం ఫోన్లు లాక్కొని వెళ్లడం దొంగతనాలు జరుగుతున్నాయని అటువంటి వాటి పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ అధికారులు అంగన్వాడీ కార్యకర్తలు ఉపాధ్యాయులు డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు

# వేరుసెనగ విత్తనాలపై 90 శాతం సబ్సిడీ ఇవ్వాలి

## -సిపిఎం పార్టీ నిరసన.



**గుత్తి జూన్ 02 రిపబ్లిక్ న్యూస్** వేరుసెనగ విత్తన బస్తాలపై రైతుల కోసం 90 శాతం సబ్సిడీ ఇవ్వాలని, ఎకరాకు 5 బస్తాల చొప్పున పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం తహసిల్దార్ కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి నిర్మల మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతాంగానికి ప్రభుత్వం తక్కువ ధరకే నాణ్యమైన విత్తనాలు అందించి అండగా నిలవాలని, తక్షణమే సబ్సిడీ విత్తనాలను సరఫరా చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు రామకృష్ణ మల్లేష్ మల్లికార్జున రామేశ్వరి చందు నాగరత్నమ్మ శశికళ సునీత తదితరులు పాల్గొన్నారు.

# ఆశా వర్కర్లను మనుషులుగా చూడాలి

## -సీఐటీయూ నాయకుల డిమాండ్




**రైల్వేకోడూరు జూన్ 2 రిపబ్లిక్ న్యూస్.**

ఆశా వర్కర్లను రాత్రి వేళల్లో విధులకు హాజరు కావాలని ఎటువంటి ప్రభుత్వ ఉత్తర్వులు (జీఓ) లేకుండానే అధికారులు ఆదేశించడం తక్షణమే నిలిపివేయాలని సీఐటీయూ రాష్ట్ర నాయకులు సిహెచ్. చంద్రశేఖర్, ఆర్. వెంకటేష్ డిమాండ్ చేశారు. మంగళవారం రైల్వే కోడూరులోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పట్టపగలే మహిళల భద్రత ప్రశ్నార్థకంగా ఉన్న పరిస్థితుల్లో ఆశా వర్కర్లను రాత్రి వేళల్లో విధులకు పిలవడం అన్యాయమని వారు పేర్కొన్నారు. ఆశా వర్కర్లకు కనీస వేతనం అమలు చేయకుండా, గౌరవ వేతనం పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెట్టిచాకిరీ చేయిస్తున్నాయని విమర్శించారు. ఆశా వర్కర్లకు నెలకు రూ.26,000 కనీస వేతనం చెల్లించాలని, వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి ప్రభుత్వ ఉద్యోగులతో సమాన హక్కులు, సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం ప్రభుత్వం చెల్లిస్తున్న రూ.10,000లోనే సుమారు రూ.4,000 వరకు ప్రయాణ ఖర్చులకే వెచ్చించాల్సి వస్తోందని తెలిపారు. వేతనాలను ప్రతి నెలా సకాలంలో చెల్లించడంతో పాటు టీఏ, డీఏ, చెల్లించాలని, వారాంతపు సెలవులు, ఇతర సెలవు సౌకర్యాలు కల్పించాలని కోరారు. అలాగే నాణ్యమైన మొబైల్ ఫోన్లు, యూనిఫాంలు అందించాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆశా వర్కర్ల సంఖ్యను పెంచి పని భారం తగ్గించాలని, దహన సంస్కార ఖర్చుల కోసం రూ.20,000, మరణ బీమా కింద రూ.10 లక్షలు చెల్లించాలని కోరారు. అదేవిధంగా ఆశా వర్కర్లకు 8 గంటల పని హక్కు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి పి. జాన్ ప్రసాద్ పాల్గొన్నారు.

# ఏ.ధనంజయకు ఎస్సై నుండి సీఐగా ప్రమోషన్

### ఉలిందకొండ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న ఏ.ధనంజయ



**కల్లూరు ప్రతినిధి, జూన్ 2, (రిపబ్లిక్ న్యూస్)**
ఉలిందకొండ ఎస్సై ఏ.ధనంజయకు సిఐగా ప్రమోషన్ వచ్చినందుకు ఉలిందకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాల ప్రజలు ఎస్సై ధనుంజయకు సిఐగా ప్రమోషన్ వచ్చినందుకు చాలా సంతోషం పడుతున్నారు, ఎందుకంటేప్రతి గ్రామంలోనూ గలాటాలు లేకుండా గ్రామాల ప్రజలతో ఆయన అందరికీ నచ్చ చెప్పేవారు గలాటాల వలన మీరు జైలుకు వెళితే మీ పిల్లలకు ఉద్యోగాలు రావని అలాగే మీసంసారాలు కూడా నాశనం అవుతాయని ఆయన ప్రజలకు నచ్చ చెప్పేవారు, గొడవలు వద్దని అందరూ కలిసిమెలిసి ఉండాలని ఆయన చెప్పేవారు, ఏ.ధనుంజయ సేవలను గుర్తించి సిఐగా ప్రమోషన్ రావడం చాలా సంతోషకరమైన విషయం అలాగే,ఓర్వకల్లు మండలం గ్రామాల ప్రజలు కూడా ఎస్సై ఏ,ధనుంజయకు సిఐగా ప్రమోషన్ వచ్చినందుకు ఓర్వకల్లు గ్రామాల ప్రజలు చాలా సంతోషపడుతున్నారు ఎందుకంటే ఓర్వకల్లు మండలంలో ఏ మీటింగ్ జరిగిన ఏ,ధనంజయను ఓర్వకల్లు కు డ్యూటీకి వేసేవారు కాబట్టి అందువలన ఓర్వకల్లు మండలం ప్రజలుఆయనకు చాలామంది తెలిసిన వాళ్ళు ఉన్నారు, వాళ్ల ప్రతి ఒక్కరు సిఐగా ప్రమోషన్ వచ్చినందుకు చాలా సంతోషపడుతున్నారు, ఏ,ధనంజయ సిఐ కావడం చాలా సంతోషకరమని ఓర్వకల్లు మండల గ్రామాల ప్రజలు సిఐ ఏ,ధనంజయ కు శుభాకాంక్షలు తెలిపిన గ్రామాల ప్రజలు

# మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలి.



**రైల్వేకోడూరు జూన్ 2 రిపబ్లిక్ న్యూస్.**
రైల్వే కోడూరు మండలంరెడ్డివారిపల్లి వైఎస్సార్ కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు సత్వరమే చర్యలు తీసుకోవాలని సిఐటియు నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు మండల కార్యదర్శి జాన్ ప్రసాద్ మాట్లాడుతూ రైల్వే కోడూరు మండల పరిధిలోని రెడ్డివారిపల్లి వైఎస్సార్ కాలనీలో సుమారు 1200 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. అయితే కాలనీ ఏర్పడి చాలా సంవత్సరాలు గడిచినా ఇప్పటికీ ప్రజలు అనేక మౌలిక సదుపాయాల సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.కాలనీలో సరైన రహదారులు లేకపోవడం వల్ల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధాన రహదారి నుండి కాలనీలోకి వెళ్లే మార్గంలో వీధి దీపాలు లేకపోవడంతో రాత్రి సమయంలో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. అదేవిధంగా మంచినీటి సౌకర్యం సక్రమంగా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.కాలనీలో నివసిస్తున్న ప్రజలకు సంబంధించి స్మశానవాటిక వంటి ప్రాథమిక అవసరాలు కూడా అందుబాటులో లేకపోవడం అత్యంత బాధాకరం. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేందుకు అత్యవసరంగా రోడ్లు, వీధి దీపాలు, మంచినీటి సౌకర్యం మరియు ఇతర మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరం ఉంది.కావున పై సమస్యలను పరిశీలించి తక్షణ చర్యలు తీసుకొని రెడ్డివారిపల్లి వైఎస్సార్ కాలనీ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించవలసిందిగా సిఐటియు తరపున వినమ్రంగా కోరుతున్నాము.ఎమ్మార్వో గారు తక్షణమే స్పందించి రెండు రోజుల్లో వీధి బల్బులను ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో సిఐటియు బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్ రాజశేఖర్ బండారు , వివో ఏ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# అనంత అభివృద్ధిపై సీఎం దృష్టి

### చంద్రబాబుతో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రత్యేక భేటీ



**అమరావతి/అనంతపురం సంక్షేమం, జూన్ 02,(రిపబ్లిక్ న్యూస్ ):**
అనంతపురం నగర అభివృద్ధికి సంబంధించిన కీలక అంశాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తీసుకెళ్లారు. సీఐఆర్‌పై ముఖ్యమంత్రి నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న అనంతరం ఆయన సీఎంతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు.ఈ సందర్భంగా అనంతపురం నగరంలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, అత్యవసరంగా చేపట్టాల్సిన మౌలిక సదుపాయాల పనులపై ఎమ్మెల్యే వివరించారు. ముఖ్యంగా నగర పారిశుద్ధ్య వ్యవస్థను మెరుగుపరిచే అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ప్రాజెక్టు అవసరాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఈ ప్రాజెక్టు అమలైతే భవిష్యత్తులో పారిశుద్ధ్య సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు.వర్షాకాలం నేపథ్యంలో రక్షణ గోడల ప్రతిపాదన ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమవుతున్నందున నడిమివంక, మరువవంక ప్రాంతాల్లో రక్షణ గోడల నిర్మాణం అత్యవసరమని ఎమ్మెల్యే వివరించారు. భారీ వర్షాల సమయంలో వరద ముప్పును నివారించేందుకు ప్రొటెక్షన్ వాల్స్ నిర్మాణం కీలకమని సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం.

**డంపింగ్ యార్డు పనులపై వివరణ**

నగర పరిధిలోని డంపింగ్ యార్డులో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని కూడా ఎమ్మెల్యే ముఖ్యమంత్రికి వివరించారు. వ్యర్థాల నిర్వహణలో ఆధునిక విధానాలను అమలు చేయడం ద్వారా నగరాన్ని మరింత పరిశుభ్రంగా తీర్చిదిద్దే చర్యలు కొనసాగు తున్నాయని తెలిపారు. నియోజకవర్గంలోని తాజా రాజకీయ పరిణామాలపై కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరా తీశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు క్రమశిక్షణతో వ్యవహరించాలని సూచించిన ఆయన, క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా కృషి చేయాలని ఎమ్మెల్యే దగ్గుబాటికి ప్రత్యేకంగా సూచించారు.

# ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ స్నాతకోత్సవంలో కర్నూలు మెడికల్ కాలేజీ విద్యార్థుల ప్రతిభా పతాకం

### పీజీ, యూజీ విభాగాల్లో పలువురు వైద్య విద్యార్థులకు గోల్డ్, సిల్వర్ మెడల్స్ రాష్ట్రస్థాయిలో కేఎంసీకి ప్రత్యేక గుర్తింపు







**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 2)**
ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ 29వ, 30వ వార్షిక స్నాతకోత్సవాల్లో కర్నూలు మెడికల్ కాలేజీ (కేఎంసీ)కి చెందిన పీజీ, యూజీ విద్యార్థులు విశేష ప్రతిభ కనబర్చి గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్, యూనివర్సిటీ చాన్సలర్ ఎస్. అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.
పీజీ విభాగంలో డా. జూకూరి సంజీవ్ కుమార్ న్యూరోసర్జరీలో రాష్ట్రస్థాయి బెస్ట్ అవుట్‌గోయింగ్ స్టూడెంట్‌గా ఎంపికై ప్రొఫెసర్ ఎంఆర్సీ నాయుడు గోల్డ్ మెడల్ అందుకున్నారు. డా. మహేష్, డా. సాయి శంకర్ వినోద్‌లు డీఎం కార్డియాలజీలో డా. శేషగిరిరావు మెమోరియల్ గోల్డ్ మెడల్ సాధించారు. గ్యాస్ట్రోఎంటరాలజీలో డా. బిలాల్ మొహిద్దిన్ షేక్‌కు పి. గోపాలకృష్ణ గోల్డ్ మెడల్ లభించింది.
ఎంఎస్ ఈఎన్‌టీలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన డా. నజ్మా బెస్ట్ ఉమెన్ స్టూడెంట్‌గా డాక్టర్ వెంకట చంద్రాచార్యుల మెమోరియల్ గోల్డ్ మెడల్, డా. తిలక్ మెమోరియల్ గోల్డ్ మెడల్, ఏవోసీ అవార్డు, ఈఎఫ్ డేస్మండ్ అవార్డులను అందుకున్నారు. ఎండీ జనరల్ మెడిసిన్‌లో డా. సాయి హరికృష్ణ బెస్ట్ అవుట్‌గోయింగ్ స్టూడెంట్‌గా శ్రీపాద లక్ష్మీనారాయణమూర్తి మెమోరియల్ గోల్డ్ మెడల్, డాక్టర్ బి. పురుషోత్తంరావు గోల్డ్ మెడల్ అందుకున్నారు. ఆఫ్తాల్మాలజీలో డా. చంద్రసింధు ప్రియకు డాక్టర్ బీకే రాజు సిల్వర్ మెడల్ ప్రదానం చేశారు.యూజీ విభాగంలో కేఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిచరణ్ కుమార్తె డాక్టర్ పెరిగెల నమ్రత రాష్ట్రస్థాయి బెస్ట్ అవుట్‌గోయింగ్ ఉమెన్ స్టూడెంట్‌గా నిలిచి డాక్టర్ పాలెపు సావిత్రి మెమోరియల్ అవార్డు, డాక్టర్ కేఎన్ రావు గోల్డ్ మెడల్, డాక్టర్ టి. సాంబమూర్తి గోల్డ్ మెడల్, డాక్టర్ కావూరి హైమావతి చలపతిరావు అవార్డు, డాక్టర్ శ్రీనివాసన్ మెమోరియల్ గోల్డ్ మెడల్ సహా పలు ప్రతిష్ఠాత్మక అవార్డులను అందుకున్నారు.
అలాగే ఆఫ్తాల్మాలజీ ప్రొఫెసర్ కేవీఎల్‌ఎం రాజు కుమార్తె డా. కంచి జయశ్రీ వైష్ణవి వర్మ ఈఎన్‌టీ సబ్జెక్టులో రాష్ట్రస్థాయిలో అత్యధిక మార్కులు సాధించి డాక్టర్ పీఎన్ రావు, డాక్టర్ సత్యమూర్తి అవార్డులను అందుకున్నారు. ప్రస్తుతం డాక్టర్ నమ్రత ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, న్యూ ఢిల్లీ లో ఎండీ పీడియాట్రిక్స్ అభ్యసిస్తున్నారు. భవిష్యత్తులో పీడియాట్రిక్ న్యూరాలజిస్టుగా సేవలందించాలన్నది తన లక్ష్యమని తెలిపారు.
ఈ సందర్భంగా స్నాతకోత్సవంలో ఉత్తమ ప్రతిభ కనబర్చి అవార్డులు సాధించిన విద్యార్థులను అడిషనల్ డీఎంఈ, కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. చిట్టి నరసమ్మ అభినందించి, వారి భవిష్యత్తు మరింత విజయవంతంగా ఉండాలని ఆకాంక్షించారు.

# జూన్ 5న వసతి గృహాల్లో భారీ మొక్కల నాటకం

### స్వర్ణాంధ్రస్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా విద్యాసంస్థల్లో పర్యావరణహిత చర్యలు వేగవంతం చేయాలని కలెక్టర్ డా. ఏ. సిరి ఆదేశం







**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 2)**
స్వర్ణాంధ్రస్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వసతి గృహాలు, విద్యాసంస్థలను పర్యావరణహిత కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి అధికారులను ఆదేశించారు. జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లావ్యాప్తంగా మొక్కల నాటకం నిర్వహించి, నెట్ జీరో హెల్తీ క్యాంపస్‌ల ఏర్పాటుకు కృషి చేయాలని సూచించారు.
కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛత, పునరుత్పాదక శక్తి వినియోగం, విద్యాసంస్థల అభివృద్ధి అంశాలపై సమగ్రంగా చర్చించారు.
నెట్ జీరో ఎనర్జీ లక్ష్యంతో నేడ్‌క్యాప్ ఆధ్వర్యంలో సోలార్ ప్యానెల్‌ల ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మియావాకి విధానంలో హైడెన్సిటీ, అల్ట్రా హైడెన్సిటీ ప్లాంటేషన్‌లను చేపట్టాలని సూచించారు. డ్వామా గుర్తించిన 13 విద్యాసంస్థల్లో పావు ఎకరా విస్తీర్ణంలో సుమారు 1,625 మొక్కలను నాటేందుకు ఏర్పాట్లు చేయాలని డ్వామా పీడీ నరసింహారెడ్డికి ఆదేశాలు జారీ చేశారు.
అలాగే ట్రైబల్, ఎస్సీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల పరిధిలోని విద్యాసంస్థల్లో కూడా అవసరాలకు అనుగుణంగా మొక్కల నాటకం చేపట్టాలని సూచించారు. మొక్కల నాటకంతో పాటు వాటి సంరక్షణకు కూడా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని స్పష్టం చేశారు.
బయో వేస్ట్, లిక్విడ్ వేస్ట్ నిర్వహణ, రైన్‌వాటర్ హార్వెస్టింగ్, సోక్‌పిట్లు, గ్రే వాటర్ పిట్లు, కిచెన్ వేస్ట్ పిట్ల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.
వసతి గృహాల్లో విద్యార్థులకు పౌష్టికాహారం, నాణ్యమైన తాగునీరు, మెరుగైన పారిశుద్ధ్య సౌకర్యాలు, ఫ్యాన్లు, లైట్లు, టాయిలెట్లు అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. దోమలు, ఈగలు రాకుండా మెష్‌ల ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యార్థుల సంక్షేమం, భద్రత, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు.
ఈ సమావేశంలో డ్వామా పీడీ నరసింహారెడ్డి, సోషల్ వెల్ఫేర్ అధికారి రాధిక, బీసీ వెల్ఫేర్ అధికారి ప్రసూన, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి సురేష్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్, మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఆటో ను డికొట్టిన లారి.

### ఒకరు మృతి.



**రైల్వేకోడూరు జూన్ 2 రిపబ్లిక్ న్యూస్.**
రైల్వే కోడూరు నియోజకవర్గం, పుల్లంపేట మండల పరిధిలో ఉన్న శితరాజంపేట పుల్లంగేరు బ్రిడ్జి పై మద్యం మత్తులో ఉన్న లారి డ్రైవర్ ఆటో ను గుద్దడంతో పుల్లంపేట నాగలాపురిగట్టు వీధికి చెందిన కొండపల్లి రాజశేఖర్ ఆచారి అక్కడిక్కడే మృతి చెందేడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన ఫలానికి చేరుకుని ట్రాఫిక్కును క్రమబద్ధీకరించడం జరిగినది పుల్లంపేట యస్ ఐ, చిన్నరెడ్డప్ప సంఘటన స్థలానికి చేరుకొని, మృతదేహానికి పంచనామా చేసి పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట ప్రభుత్వ హాస్పిటల్ కు తరలించారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్సై తెలియజేశారు.



# సంగారెడ్డి జిల్లా కేంద్రంలో బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు




**ఆందోల్ నియోజకవర్గం జూన్ 2( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు గొల్ల సతీష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో బహుజన సమాజ్ పార్టీ 2004లో ప్రణబ్ కమిటీకి మొట్టమొదటిగా తెలంగాణ ఏర్పాటు కోసం లేపి ఇవ్వడం జరిగింది అదేవిధంగా పార్లమెంటులో తెలంగాణ బిల్లు ఆమోదానికి 39 మంది ఎంపీలతో బే షరతుగా మద్దతు ప్రకటించడం జరిగింది. మరి సాధించుకున్న తెలంగాణ అమరవీరులు త్యాగాలతోటి సాధించుకున్న తెలంగాణని ఈరోజు ధరలు సంపన్న కుటుంబాలు బాగుపడ్డారు తప్ప బహుజన సమాజం ముఖ్యంగా బీసీ ఎస్సీ ఎస్టీలు ఎవరు కూడా తెలంగాణ రాకముందేలా ఉండెను ఇప్పుడు కూడా అదే పరిస్థితులలో ఉన్నారు మరి తెలంగాణ రాష్ట్రం తోటి కల్వకుంట్ల కుటుంబం మరియు సంపన్న వర్గాలు బాగుపడే తప్ప బహుజనులు ముఖ్యంగా 80 శాతం ఉన్నటువంటి ప్రజలు ఓటు ద్వారా రాజ్యం సాధించి భోజన రాజ్యం ఏర్పరచుకుంటారని ఆశిస్తూ బంగారు తెలంగాణ అనేది ఒక బూటకం బహుజన తెలంగాణతోటి భోజన సమాజానికి తెలంగాణ ప్రజానీకం కి ప్రజా తెలంగాణ ఏర్పడి న్యాయం జరుగుతుంది తెలియజేశారు

# జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలలో న్యూక్లియస్ కళాశాల విజయదుందుభి



**నంద్యాల, జూన్ 2, (రిపబ్లిక్ న్యూస్):** 2026 సంవత్సరానికి గాను ఇటీవల విడుదలైన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలలో న్యూక్లియస్ కళాశాల విద్యార్థులు మరోమారు ప్రతిభ చాటారు. కళాశాల విద్యార్థిని సి.ఎన్. నాగ హర్షిత రెడ్డి ఈ.డబ్ల్యూ.ఎస్ కేటగిరీలో 5108 ర్యాంకు, బి. సోఫియా బి–కేటగిరీలో 10216 ర్యాంకు సాధించారు. ఐఐటీలలో సీట్లు పొందగలిగే ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ మురళీధర్ రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్, డైరెక్టర్ వాసుదేవరెడ్డి అభినందించారు. వీరితో పాటు మరికొందరు విద్యార్థులు ఎన్ఐటీ, ఐఐటీలలో సీట్లు పొందగలిగేలా జేఈఈ మెయిన్స్ లో ఉత్తమ ర్యాంకులు సాధించారు. గతంలో (2025లో) కూడా ఈ కళాశాలకు చెందిన శ్రీరాములు లిఖిత్ ఐఐటీ మద్రాస్, అనీస్ తబస్సుమ్ ఐఐటీ పాలక్కాడ్‌లలో సీట్లు సాధించారు. వీరితో పాటు ప్రదీప్ – ఎన్ఐటీ తేజ్‌పూర్, స్నేహలతారెడ్డి – ట్రిపుల్ ఐటీ ధార్వాడ్, పద్మ మీనాక్షి – ట్రిపుల్ ఐటీ కర్నూలు, సబీరా – ట్రిపుల్ ఐటీ కర్నూలులో సీట్లు పొందారు. అలాగే 2026 ఇంటర్మీడియట్ ఫలితాలలో సైతం ప్రథమ, ద్వితీయ సంవత్సరాల అన్ని గ్రూపులలో ఈ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి ఉత్తమ ఫలితాలు సాధించారు.

# జిల్లాలో 85 శాతం ధాన్యం కొనుగోలు పూర్తి

## జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్







**మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 2( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**
రైతులు ఇబ్బందులు పడకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసేందుకు జిల్లా కలెక్టర్ నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ, అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ, కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేస్తూ ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.

ప్రతిరోజూ సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ, ధాన్యం కొనుగోళ్లు, రవాణా, మిల్లులకు తరలింపు, సమస్యలపై ఆరా తీస్తున్నారు. ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశిస్తున్నారు.మరోవైపు జిల్లాలోని వివిధ మండలాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్వయంగా సందర్శిస్తూ, రైతులతో మాట్లాడుతున్నారు. కాంటా ప్రక్రియ, తేమ శాతం పరీక్షలు, రికార్డుల నిర్వహణ, ధాన్యం నిల్వలు, రవాణా ఏర్పాట్లను పరిశీలిస్తూ, కొనుగోళ్లలో ఎలాంటి జాప్యం జరగకుండా చర్యలు తీసుకుంటున్నారు.ధాన్యం బస్తాలు కేంద్రాల్లో ఎక్కువ కాలం నిల్వ ఉండకుండా వెంటనే మిల్లులకు తరలించాలని సంబంధిత శాఖలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అవసరమైన చోట అదనపు వాహనాలు, హమాలీలను అందుబాటులో ఉంచి కొనుగోళ్లను వేగవంతం చేస్తున్నారు. ఇప్పటివరకు 68,518 రైతుల వద్ద నుంచి 3,31,982.080 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయగా,53,086 మంది రైతుల ఖాతాల్లోకి రూ. 571.48 కోట్లు జమ చేయడం జరిగిందన్నారు. 164 ధాన్యం కొనుగోలు కేంద్రాలు మూసివేశామన్నారు.

కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ఓపీఎంఎస్ లో నమోదు చేయడం జరిగిందని,ప్రతి మిల్లు, కేంద్రం వారీగా కొనుగోలు వివరాలు, మిల్లులకు తరలించిన ధాన్యం వివరాలు, అలాగే మిల్లుల వద్ద ఎంత అన్లోడింగ్ పెండింగ్ ఉంది అనే వివరాలు ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు.ధాన్యం రవాణా, నిల్వ, లోడింగ్, అన్లోడింగ్, కొనుగోలు కేంద్రాల నిర్వహణలో ఎటువంటి ఆలస్యం లేకుండా అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు.జిల్లాలో ప్రస్తుతం 600 లారీలు, 50 డీసీఎంలు, 300 ట్రాక్టర్లు అందుబాటులో ఉన్నాయని వివరించారు.గోదాములు, రైస్ మిల్లుల వద్ద నిలిచిపోయిన లారీలను వెంటనే అన్‌లోడ్ చేసి, తిరిగి కొనుగోలు కేంద్రాలకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు లక్ష్యాలను నిర్దేశిత సమయంలోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. మిల్లులకు వచ్చే ధాన్యాన్ని మరింత మంది హమాలీలను పెట్టుకొని, త్వరగా దిగుమతి అయ్యేలా అధికారులు పర్యవేక్షించాలన్నారు.రవాణా, గోదాముల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కొనుగోలు కేంద్రాల పనితీరు పట్ల అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ, నిరంతరం పర్యవేక్షించాలనీ మంగళవారం జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు.

# మహిళలు రవాణా రంగంలో ప్రవేశించడం వల్ల మహిళా సాధికారత పెరుగుతుంది

**--జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ -ఎలక్ట్రిక్ ఆటో పంపిణీ**

**ఆటో డ్రైవర్ గా అదనపు కలెక్టర్ నగేష్, ఆటోలో ప్రయాణించిన జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్,**





**మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 2( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
అజివిక గ్రామీణ ఎక్స్ ప్రెస్ యోజన పథకం కింద 3,35,000 రూపాయల ధర కల్గిన మహేంద్ర ఎలక్ట్రిక్ ఆటోను మక్తా భూపతిపూర్ గ్రామానికి చెందిన కే.సంధ్య రాణి కి మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ గారి చేతుల మీదుగా పంపిణీ చేశారు. సంధ్య రాణి గత రెండు సం: కిత్రం గ్రామీణ అభివృద్ధి శాఖ కార్యాలయంలో ఉపాధి నిమిత్తం దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తులు పరిశీలిన అనంతరం సంధ్య రాణినీ అర్హులు గా గుర్తించి ఆటో ను మంజూరు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ..ఈ పథకం ద్వారా వెనుకబడిన ప్రాంతాలలో నివసించే ప్రజలకు సురక్షితమైన రవాణా అందుబాటులోకి వస్తుందనీ, మహిళలు రవాణా రంగంలోకి ప్రవేశించడం వల్ల మహిళా సాధికారత పెరుగుతుందనీ అన్నారు. ఆజీవిక గ్రామీణ ఎక్స్‌ప్రెస్ యోజన (రా+జ్) అనేది ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ప్రవేశపెట్టిన ఒక ప్రత్యేకమైన పథకం. గ్రామీణ ప్రాంతాలలో నివసించే స్వయం సహాయక సంఘాల (రా౨+) మహిళలకు రవాణా సేవలను నడుపుకునే అవకాశం కల్పించడం ద్వారా, వారికి అదనపు ఆదాయాన్ని మరియు ఉపాధిని అందించడం దీని ముఖ్య ఉద్దేశం అని అన్నారు.

మహిళలు సొంతంగా ఆర్థికంగా ఎదగాలన్నారు. మక్తా భూపతిపూర్ లో రవాణాకు సమస్య ఉందని ,ఎలాంటి సౌకర్యం లేదని తన దృష్టికి వచ్చిన వెంబడే ఎలక్ట్రిక్ ఆటో మంజూరు చేశామన్నారు.

ఆటో డ్రైవర్ గా మారి అదనపు కలెక్టర్ నగేష్ ఆటో నడిపారు. ఆటోలో ప్రయాణికులు గా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ప్రయాణించారు. ఈ సన్నివేశం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్,గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి శ్రీనివాస్ రావు,అదనపు గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి సరస్వతి,డి పి యం యాదయ్య, ఏ పి యం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## జూన్ 4, 6, 8, 10 తేదీలలో జిల్లా వ్యాప్తంగా గ్రామసభలు, వార్డు సభలు

# పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలి

## జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్





**మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 2 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**
రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యాచరణ పర్యావరణ వారోత్సవాల నిర్వహణతో పాటుగా గ్రామసభల నిర్వహణపై మంగళవారం హైదరాబాదు నుండి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి మెదక్ జిల్లా కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ,ఎస్పీ శ్రీనివాసరావు తో కలిసి హాజరయ్యారు.

ఈ సందర్భంగా సిఎస్ రామకృష్ణారావు మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పర్యావరణ వారోత్సవాల నిర్వహణతోపాటుగా రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 4, 6, 8, 10 తేదీలలో గ్రామ సభలు, వార్డు సభలు నిర్వహించి ప్రజల్లో అనేక అంశాలపై అవగాహన కల్పిస్తూ ప్రత్యక్ష ప్రజా భాగస్వామ్యాన్ని పెంపొందించాలని సూచించారు.

జూన్ నెల నుంచి ప్రారంభం కానున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (రా×=) పై ప్రజల్లో అవగాహన కల్పించి ప్రజాస్వామ్య భాగస్వామ్యం పెంచాలని సూచించారు. అదేవిధంగా రాష్ట్రంలో రైతాంగం స్థిరమైన వ్యవసాయం కోసం పంటల మార్పిడి దిశగా మారాల్సిన ఆవశ్యకతపై అవగాహన కల్పించాలన్నారు. వర్షాకాల సన్నద్ధత, విస్తృత స్థాయి మొక్కల నాటకం, ఘన వ్యర్థాల నిర్వహణతో పరిశుభ్రమైన గ్రామాల నిర్మాణం వంటి అంశాల్లో ప్రజల్లో చైతన్యం కల్పించాలన్నారు. స్వయం సహాయక సంఘాలు, స్థానిక నాయకుల భాగస్వామ్యంతో ప్రజల్లో చైతన్యం కల్పించడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.పభుత్వ కార్యక్రమాల సమర్థవంతమైన అమలుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజలకు విస్తృత స్థాయిలో చేరువ కావాలని సూచించారు. ప్రజా సంక్షేమ కార్యక్రమాల విజయవంతమైన అమలుకు పోలీస్ శాఖతో పాటు అన్ని ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం బలోపేతం చేయాలని డీజీపీ సి.వి. ఆనంద్ పేర్కొన్నారు.

విసి అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. జూన్ 4, 6, 8, 10 తేదీలలో జిల్లా వ్యాప్తంగా మండలాల వారీగా గ్రామసభలు, వార్డు సభలు సమన్వయంతో పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పర్యావరణ వారోత్సవాలను కొనసాగిస్తూనే గ్రామ సభలను కూడా నిర్వహించాలన్నారు. మండలాల వారీగా అనుకూలమైన తేదీలను చూసుకొని ఆ నాలుగు తేదీలలో అన్ని గ్రామాల్లో గ్రామసభలు జరిగేలా చూడాలని డిపిఓకు ఆదేశించారు. ఈ గ్రామ సభల్లో బాల్య వివాహాల నిర్మూలన, రోడ్డు భద్రత, మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమాలు కల్పించాలన్నారు. వీటితో పాటుగా రైతాంగం పంట మార్పిడి దిశగా అడుగులు వేసేందుకు అవగాహన కల్పించాలని సూచించారు. వరి పంటకు ఆసక్తి చూపినట్లయితే సన్న రకం వరి పంటను వేసే విధంగా ప్రోత్సహించాలన్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ పైన ప్రజలకు తెలియజేయాలని సూచించారు. ఘన వ్యర్థాల నిర్వహణ, ఇంకుడు గుంతల ప్రాధాన్యత, మొక్కల పెంపకంపై చైతన్యం కల్పించే కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. రానున్న వర్షాకాలం ని దృష్టిలో ఉంచుకొని విపత్తు నిర్వహణ బృందాలు అప్రమత్తం కావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాలను గ్రామస్థాయి నుంచి మండల, జిల్లా స్థాయి వరకు అధికారులందరూ సమన్వయంతో పకడ్బందీగా నిర్వహించి విజయవంతం చేయాలని ఆదేశించారు.

సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్ ,గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, పంచాయతీ అధికారి యాదయ్య, అగ్రికల్చర్ అధికారి దేవ్ కుమార్,డి ఎస్ పి లు ఇతర అధికారులు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

# ప్రజల ఉద్యమం, అమర వీరుల త్యాగం వల్ల తెలంగాణ రాష్ట్రం

**-రాష్ట్ర కార్మిక ఉపాధి,శిక్షణ, పరిశ్రమలు, గనుల భూగర్భ శాఖ మంత్రి, జిల్లా ఇంచార్జి మంత్రి వెంకట స్వామి**






**మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 2 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్)** మంగళవారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా మెదక్ జిల్లా చిన్న శంకరంపేట్ ఆర్ మండల కేంద్రంలోని అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ అమరులకు ఘనంగా జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు వివేక్ వెంకటస్వామి గారు, జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ , జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు ,తూప్రాన్ డిఎస్పి, తాహాసిల్దార్, ఎంపీడీవో, గ్రామ సర్పంచ్,లు నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకట స్వామి మాట్లాడుతూ...ప్రజల ఉద్యమం, అమరుల త్యాగం వల్ల తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందన్నారు.తెలంగాణ కోసం పోరాటం చేస్తే చాలామంది అపహాస్యం చేశారని,అన్ని రాజకీయ పార్టీలు తెలంగాణ కోసం మద్దతు పలికాయన్నారు.వాయిస్ ఓటు తో తెలంగాణ రాష్ట్ర విభజన జరిగిందనీ, వాయిస్ ఓటు కోసం జైపాల్ రెడ్డి ముందుకొచ్చారన్నారు.తెలంగాణ ఉద్యమంలో త్యాగం చేసిన 300 మందికి లక్ష రూపాయల చొప్పున అందించామన్నారు.డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ ముందు చూపు వల్ల తెలంగాణ వచ్చిందని గుర్తు చేశారు.విద్య ,వైద్యం కోసం ప్రభుత్వం చొరవ చూపుతుందన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రేషన్ కార్డులు,ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందనీ పేర్కొన్నారు.నైపుణ్య అభివృద్ధి కేంద్రాలు నెలకొల్పి ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నామన్నారు.గత ప్రభుత్వం ప్రాజెక్ట్ ల పేరిట కాలయాపన చేసిందన్నారు. గతం కంటే 30 శాతం ధాన్యం అదనంగా కొనుగోలు చేశామన్నారు.ఈ కార్యక్రమంలో అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.ద

# అంగరంగ వైభవంగా తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలు

**అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు , గుడిసెలు లేని మెదక్ జిల్లా గా తీర్చిదిద్దాలి**

**జిల్లా సమైక్య సభ్యులకు 102 కోట్ల 35 లక్షల జంబో చెక్కు ను పంపిణీ చేసిన మంత్రి**

**తెలంగాణ అమరవీరులకు ఘనమైన నివాళులు.**

**తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు :: రాష్ట్ర కార్మిక ఉపాధి,శిక్షణ, పరిశ్రమలు, గనుల భూగర్భ శాఖ మంత్రి, జిల్లా ఇంచార్జి మంత్రి వెంకట స్వామి**







**మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 2 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభసందర్భంగా రాష్ట్ర కార్మిక ఉపాధి,శిక్షణ, పరిశ్రమలు, గనుల భూగర్భ శాఖ మంత్రి, జిల్లా ఇంచార్జి మంత్రి వెంకట స్వామి జిల్లా ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల సందర్భంగా మంగళవారం కలెక్టరేట్ లో నిర్వహించిన వేడుకలకు మంత్రి హాజరై తెలంగాణ సాధన కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరుల త్యాగాలు, ఉద్యమకారుల పోరాట స్ఫూర్తి ఫలితంగానే ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భవించిందని పేర్కొంటూ అమరవీరులకు ఘనమైన నివాళులు అర్పించి, జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, జాతీయ గీతాలాపన చేసి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు.

ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకట స్వామి మాట్లాడుతూ, ప్రజల ఆకాంక్షల మేరకు ఏర్పడిన తెలంగాణ రాష్ట్రాన్ని సమగ్ర అభివృద్ధి, సామాజిక న్యాయం, ఆర్థిక పురోగతి దిశగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని అన్నారు. రైతుల సంక్షేమం, మహిళల సాధికారత, యువతకు ఉపాధి అవకాశాలు, విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రజలకు పారదర్శక, జవాబుదారీతనంతో కూడిన పాలన అందిస్తూ ప్రతి కుటుంబానికి అభివృద్ధి ఫలాలు చేరేలా నిరంతరం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణ పునర్నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ఐక్యత, సౌభ్రాతృత్వంతో రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిద్దామని పిలుపునిచ్చారు.

జిల్లా మహిళా సంఘాలకు జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జిల్లా సమైక్య సభ్యులకు 102 కోట్ల 35 లక్షల జంబో చెక్కు ను మంత్రి మహిళలకు అందించారు .శంకరం పేట (ఆర్) మండలం గరిపల్లి గ్రామానికి చెందిన వారికి 5 మంది లబ్ది దారులకు ఇందిరమ్మ ఇండ్ల రెండవ విడత మంజూరి పత్రాలు అందించారు. గుడిసెలు లేని మెదక్ జిల్లా గా తీర్చి దిద్దాలన్నారు.

విద్యార్థుల సంస్కృతిక కార్యక్రమాలు వీక్షకులను అలరించాయి. సంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులను మంత్రి అభినందించి , మెమెంటో లు అందజేశారు.

వివిధ శాఖల ద్వారా ఏర్పాటుచేసిన స్టాల్స్ ను మంత్రి సందర్శించి సుదీర్ఘంగా పరిశీలించారు.

అనంతరం ఈ సందర్భంగా తెలంగాణ అమరవీరుల కుటుంబాలను ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా ఎస్పి శ్రీనివాస్ రావు, జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ ,మున్సిపాలిటీ చైర్ పర్సన్ రాధిక భూపతి రాజ్, మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్,గ్రంథాలయల చైర్మన్ సుహాసిని రెడ్డి, ఆర్డీవో రమాదేవి, ప్రజా ప్రతినిధులు, స్వతంత్ర సమరయోధులు, తెలంగాణ అమరవీరుల కుటుంబ సభ్యులు, జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## దౌల్తాబాద్ చౌరస్తాలో ఘనంగా

# తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం

**అంబేద్కర్, తెలంగాణ తల్లి విగ్రహాలకు పూలమాలలు వేసిన మలిదశ ఉద్యమకారులు**



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జూన్ 2 (రిపబ్లిక్ న్యూస్)**
తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆత్నూర్ మండలం దౌల్తాబాద్ చౌరస్తాలో మలిదశ ఉద్యమకారుల కమిటీ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చౌరస్తాలో ఉన్న భారతరత్న డా. బి.ఆర్. అంబేద్కర్ మరియు తెలంగాణ తల్లి విగ్రహాలకు మలిదశ ఉద్యమకారుల కమిటీ నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

ఈ కార్యక్రమానికి మలిదశ ఉద్యమకారుల కమిటీ అధ్యక్షులు చెన్న నరసింహులు, ఉపాధ్యక్షులు భట్టు మారుతి రాజు నాయకత్వం వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... ఎందరో అమరవీరుల త్యాగాలు, మలిదశ ఉద్యమకారుల సుదీర్ఘ పోరాటాల ఫలితంగానే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సాకారమైందని గుర్తుచేశారు. అమరవీరుల ఆశయాలకు అనుగుణంగా, నిరుపేదలకు సంక్షేమ ఫలాలు అందినప్పుడే నిజమైన తెలంగాణ సిద్ధిస్తుందని వారు పేర్కొన్నారు.

పాల్గొన్న ముఖ్య నాయకులు:ఈ ఘన నివాళులర్పించిన వారిలో కమిటీ నాయకులు బేగరి మల్లేశం, ఎండి జహీర్, ఏర్పుల రాజు, బండగల్ల నరసింహులు, మన్నే మహేష్ కుమార్ లతో పాటు స్థానిక ఉద్యమకారులు, ప్రజలు మరియు యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గాల సమస్యల పరిష్కారానికి కమిషన్ కట్టుబడి ఉంది

**పెండింగ్ అట్రాసిటీ కేసుల పరిష్కారానికి వేగవంతమైన చర్యలు**

**కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ఏర్పాటుకు ప్రతిపాదన**

**రెండేళ్లలో అట్రాసిటీ రహిత జిల్లాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం**

**ఎస్సీ కమీషన్ చైర్మన్ కె.ఎస్.జవహర్ స్వీకరించిన దరఖాస్తులు 62**



**నంద్యాల బ్యూరో, జూన్ 02 (రిపబ్లిక్ న్యూస్):** షెడ్యూల్డ్ కులాల ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టడమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల కమిషన్ పర్యటిస్తోందని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కె.ఎస్. జవహర్ తెలిపారు. మంగళవారం నంద్యాల కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో నిర్వహించిన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమంలో రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల కమిషన్ చైర్మన్ కె.ఎస్. జవహర్, కమిషన్ సభ్యులు పాల్గొని షెడ్యూల్డ్ కులాల ప్రజల నుంచి నేరుగా వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఎస్.చిన్నరాముడు, ఎస్సీ కమిషన్ సభ్యులు మేకల బిక్షమ్, డా.పి.గౌతం రాజు సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం విజయవాడ వరకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, కమిషన్ స్వయంగా జిల్లాలకు వచ్చి క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుంటోందన్నారు. ప్రజలకు కమిషన్ పర్యటనకు సంబంధించిన సమాచారం చేరవేయడంలో కొంత సమాచార లోపం (కమ్యూనికేషన్ గ్యాప్) ఉన్న విషయాన్ని గుర్తించామని, భవిష్యత్తులో మరింత విస్తృతంగా ప్రజలకు సమాచారం చేరేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. నంద్యాల జిల్లాలో ఇతర జిల్లాలతో పోల్చితే అట్రాసిటీ కేసుల సంఖ్య తక్కువగా ఉండడం సానుకూల పరిణామమని పేర్కొన్నారు. కమిషన్ వద్ద ఉన్న వివరాల ప్రకారం జిల్లాలో మొత్తం 53 అట్రాసిటీ కేసులు పెండింగ్‌లో ఉండగా, వాటిలో 11 కేసులకు ఇప్పటికే చర్యలు చేపట్టినట్లు తెలిపారు. మిగిలిన 42 కేసులను కూడా త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. జిల్లాలో అట్రాసిటీ కేసుల నియంత్రణలో జిల్లా యంత్రాంగం సమర్థవంతంగా పనిచేస్తోందని పేర్కొంటూ జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలను చైర్మన్ అభినందించారు. బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా, నిందితులకు సకాలంలో శిక్ష పడేలా కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాల్సిందిగా రాష్ట్ర ముఖ్యమంత్రికి ప్రతిపాదన పంపనున్నట్లు తెలిపారు. షెడ్యూల్డ్ కులాలపై ఎలాంటి వివక్ష, వేధింపులు, అట్రాసిటీలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించిన ఆయన, రాబోయే రెండేళ్లలో కర్నూలు, నంద్యాల జిల్లాలను "అట్రాసిటీ ఫ్రీ జోన్"లుగా తీర్చిదిద్దేందుకు సమగ్ర కార్యాచరణ అమలు చేయాలని కమిషన్ సంకల్పించిందన్నారు. సమాజంలో శాంతి, సామరస్యం నెలకొని ప్రతి ఒక్కరికీ సమాన న్యాయం అందే వాతావరణం కల్పించడమే కమిషన్ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

**రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల కమిషన్ చైర్మన్‌కు అందిన వినతులు**

1)గడివేముల మండలం బిలకలగూడూరు గ్రామానికి చెందిన జి. రాజు తమ కుటుంబానికి చెందిన 5 ఎకరాల భూమిని జెఎస్డబ్ల్యూ సిమెంట్ పరిశ్రమకు అప్పగించామని, భూమి ఇచ్చిన సందర్భంగా తమకు సంస్థలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని యాజమాన్యం హామీ ఇచ్చిందని తెలిపారు. అయితే, ఇప్పటివరకు ఉద్యోగం కల్పించడంలో తీవ్ర జాప్యం జరుగుతోందని పేర్కొంటూ తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రం సమర్పించారు.



2)గడివేముల మండలం బిలకలగూడూరు గ్రామానికి చెందిన ఈ. రాజు, సర్వే నెం.260లో తనకు చెందిన ఒక ఎకరం భూమిని జెఎస్డబ్ల్యూ (జీూఔ) సిమెంట్ పరిశ్రమ యాజమాన్యం ఆక్రమించుకుని ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. భూమికి సంబంధించి తగిన పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల కమిషన్ చైర్మన్‌కు అర్జీ సమర్పించారు.

3)మిడ్తూరు మండలం సంకేసుల గ్రామానికి చెందిన ఎం. జయరాముడు తాను ఎలాంటి ఉద్యోగం లేదా వ్యాపారం చేయడం లేదని, ఆదాయపు పన్ను కూడా చెల్లించడం లేదని తెలిపారు. అయినప్పటికీ హౌస్ మ్యాపింగ్‌లో తాను ఆదాయపు పన్ను చెల్లింపుదారుడిగా నమోదై ఉండటంతో ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి అందడం లేదని పేర్కొన్నారు. సంబంధిత వివరాలను సరిచేసి సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల కమిషన్ ఛైర్మన్‌కు వినతిపత్రం సమర్పించారు.

## బడి పిలుస్తోంది కార్యక్రమాన్ని ఉద్యమంలా నిర్వహించి ప్రతి బడిఈడు చిన్నారిని పాఠశాలలో చేర్పించాలి

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**



**నంద్యాల, జూన్ 02 (రిపబ్లిక్ న్యూస్)** జిల్లాలో ఒక్క బడిఈడు చిన్నారి కూడా విద్యకు దూరం కాకుండా చూడడమే లక్ష్యంగా "బడి పిలుస్తోంది" కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేసి, పాఠశాల వెలుపల ఉన్న ప్రతి చిన్నారిని గుర్తించి పాఠశాలల్లో చేర్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ ఛాంబర్‌లో "బడి పిలుస్తోంది" కార్యక్రమం అమలుపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో డీఆర్ఓ రాము నాయక్, డీఈఓ జనార్ధన్ రెడ్డి, ఐసీడీఎస్ పీడీ లీలావతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఐదేళ్లకు పైబడిన పిల్లల విభాగంలో మొత్తం 14 వేల మంది చిన్నారులను పాఠశాలల్లో చేర్చే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని తెలిపారు. ప్రస్తుతం 8,778 మంది పిల్లలు నమోదు కాగా, ఈ సంఖ్యను తక్షణమే 10 వేల మందికి పెంచేలా క్షేత్రస్థాయిలో ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో మొత్తం 14,248 అడ్మిషన్ల లక్ష్యానికి గాను ప్రస్తుతం 8,778 అడ్మిషన్లు నమోదయ్యాయని, మిగిలిన లక్ష్యాన్ని త్వరితగతిన సాధించే దిశగా అధికారులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అలాగే రెండవ తరగతి నుంచి పదవ తరగతి వరకు 1,31,974 అడ్మిషన్ల లక్ష్యానికి గాను 1,17,920 అడ్మిషన్లు పూర్తయ్యాయని, ప్రస్తుతం 89.33 శాతం నమోదైన ప్రవేశాలను 90 శాతానికి పైగా పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. మొదటి తరగతి అడ్మిషన్ల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించిన కలెక్టర్, పాఠశాలల్లో ఇంకా చేరని పిల్లలను ఇంటింటికీ వెళ్లి గుర్తించి ప్రవేశాలు కల్పించాలని ఆదేశించారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఎల్‌కేజీ, యూకేజీ పూర్తి చేసి ఐదేళ్లు నిండిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలల మొదటి తరగతిలో చేర్పించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని తెలిపారు. "బడి పిలుస్తోంది" కార్యక్రమాన్ని ప్రజా భాగస్వామ్యంతో విజయవంతం చేసి జిల్లాలో విద్యా నమోదు శాతాన్ని మరింత పెంచేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు

## రాష్ట్ర ఎస్సీ కమిషనర్ చైర్మన్ ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్సీ సెల్ నాయకులు



**గుత్తి జూన్ 02 రిపబ్లిక్ న్యూస్** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కె,ఎస్, జవహర్‌ని ఎస్సీ కమిషన్ నెంబర్ మేకల దాసు ని నంద్యాల జిల్లాలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసిన గుత్తి పట్టణ ఎస్సీ సెల్ నాయకులు పలు అంశాలపై రాష్ట్ర కమిషనర్ చైర్మన్ జోహార్ దృష్టికి తీసుకువెళ్లారు ఆయన వారికి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ఇల్లూరు శ్రీనివాసులు. ఇల్లూరు రాజశేఖర్.ఇల్లూరు ఓబులేష్ తదితరులు పాల్గొన్నారు.

# కుల వివక్షకు తావులేని సమానత్వ సమాజ నిర్మాణానికి అధికారులు కృషి చేయాలి.

**..ప్రజల పట్ల సహానుభూతితో స్పందించి పిటిషన్లను సకాలంలో పరిష్కరించాలి.**

**..నంద్యాల, కర్నూలు జిల్లాలను అట్రాసిటీ రహిత ప్రాంతాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం.**

**..ఎస్సీ వర్గాల సంక్షేమం, హక్కుల పరిరక్షణపై అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి.**

**..అట్రాసిటీ కేసుల్లో బాధితులకు త్వరితగతిన న్యాయం అందించేందుకు ఫాస్ట్ ట్రాక్ కోర్టు ప్రతిపాదన.**

**..ఎస్సీ కమిషన్ ఛైర్మన్ కె.ఎస్. జవహర్.**








**నంద్యాల :జూన్ 02,(రిపబ్లిక్ న్యూస్):** షెడ్యూల్డ్ కులాల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, కుల వివక్ష నిర్మూలన మరియు ఎస్సీ/ఎస్టీ చట్టాల సమర్థ అమలుపై అధికారులు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల కమిషన్ ఛైర్మన్ కె.ఎస్. జవహర్ అన్నారు. ప్రజల సమస్యల పట్ల సహానుభూతితో స్పందిస్తూ, పెండింగ్‌లో ఉన్న పిటిషన్లను సకాలంలో పరిష్కరించి బాధితులకు న్యాయం అందించాలని ఆయన అధికారులను ఆదేశించారు. మంగళవారం నంద్యాల కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం, పీసీఆర్ యాక్ట్ అమలు, భూ సమస్యలు, రిజర్వేషన్ల అమలు, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై ఆర్డీఓలు, డీఎస్పీలు, తహశీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు మరియు జిల్లా అధికారులతో రాష్ట్ర ఎస్సీ కమిషన్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్, ఎస్సీ కమిషన్ కార్యదర్శి ఎస్. చిన్న రాముడు, కమిషన్ సభ్యులు మేకల భిక్షం, డా. పి. గౌతం రాజు, డీఆర్ఓ రామునాయక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్సీ కమీషన్ ఛైర్మన్ జవహర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ కుల వివక్ష వివిధ రూపాల్లో కొనసాగుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. సామాజిక సమానత్వం సాధించేందుకు ప్రభుత్వ యంత్రాంగం మరింత చొరవతో పనిచేయాలని సూచించారు. ప్రజల పట్ల సానుభూతి, సేవాభావం అధికారుల్లో ఉండాలని, "రేపటి పని ఈరోజే చేయి - ఈరోజు పని ఇప్పుడే చేయి" అనే సూత్రంతో విధులు నిర్వర్తించాలని కోరారు. నంద్యాల, కర్నూలు జిల్లాలను అట్రాసిటీ రహిత ప్రాంతాలుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని, ఈ ప్రాంతంలో ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అట్రాసిటీ కేసుల్లో బాధితులకు వేగంగా న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. "జిల్లాలో మొత్తం 61 పిటిషన్లు అందగా, వాటిలో ఎస్సీ కమిషన్ కార్యదర్శికి 2, జిల్లా కలెక్టర్‌కు 47, జిల్లా ఎస్పీకి 11, నంద్యాల ఆర్డీఓకు 1 పిటిషన్ చొప్పున అందినట్లు తెలిపారు. అందిన పిటిషన్లలో కేవలం 11 కేసులకు మాత్రమే యాక్షన్ టేకెన్ రిపోర్టులు సమర్పించబడగా, మిగిలిన కేసులకు సంబంధించిన నివేదికలు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు." కమిషన్ నుంచి వచ్చిన ప్రతి నోటీసుకు సకాలంలో స్పందించి ఏటీఆర్‌లు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. అవసరమైతే ప్రత్యేక అధికారిని నియమించి కమిషన్‌తో సమన్వయం కొనసాగించాలని సూచించారు. అట్రాసిటీలు కేవలం కుల వివక్ష రూపంలోనే కాకుండా భూమి, ఆర్థిక మోసాలు, సేవా సంబంధిత అంశాల్లో కూడా జరుగుతున్నాయని తెలిపారు. తప్పుడు కేసులు, వాస్తవ పరిస్థితులను నిర్ధారించేందుకు కమిషన్ తరపున ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీలను గ్రామాలకు పంపనున్నట్లు వెల్లడించారు. ప్రజల ముందు అధికారులు ఎల్లప్పుడూ సానుకూల దృక్పథంతో వ్యవహరించాలని, ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయాలని సూచించారు. సమాజంలోని అట్టడుగు వర్గాలకు న్యాయం చేయడంలో అధికారులు చూపే నిబద్ధతే ప్రజల విశ్వాసాన్ని పెంచుతుందని పేర్కొన్నారు.

జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ/ఎస్టీ పీఓఏ చట్టం అమలు, భూ సమస్యల పరిష్కారం, రిజర్వేషన్ల అమలు, పీజీఆర్ఎస్ పిటిషన్ల పరిష్కారం, విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాలు, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై సమగ్ర సమీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నంద్యాల జిల్లాలో సుమారు 19.30 లక్షల జనాభా ఉండగా, అందులో 18 నుంచి 19 శాతం వరకు షెడ్యూల్డ్ కులాల జనాభా ఉన్నట్లు వివరించారు. జిల్లాలో 7 నియోజకవర్గాలు, 4 రెవెన్యూ డివిజన్లు, 30 మండలాలు, 6 అర్బన్ లోకల్ బాడీలు, 489 గ్రామ పంచాయతీలు ఉన్నాయని తెలిపారు. ఎస్సీ వర్గాల అభ్యున్నతి, సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరవేసే దిశగా జిల్లా యంత్రాంగం కట్టుబడి పనిచేస్తోందని చెప్పారు.

జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, నంద్యాల జిల్లాలో ఎస్సీలపై జరిగే నేరాల సంఖ్య గత రెండేళ్లతో పోలిస్తే గణనీయంగా తగ్గినట్లు తెలిపారు. 2024లో 117 కేసులు నమోదవగా, 2025లో 71 కేసులకు తగ్గాయని, 2026 ఏప్రిల్ 30 నాటికి కేవలం 8 కేసులు మాత్రమే నమోదయ్యాయని వివరించారు. శారీరక దాడులు, లైంగిక దాడుల కేసుల్లో కూడా స్పష్టమైన తగ్గుదల నమోదైందన్నారు. జిల్లాలో మొత్తం 46 అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులు ఉండగా, వాటిలో 31 కేసులకు చార్జ్‌షీట్లు దాఖలు చేసినట్లు తెలిపారు. మిగిలిన కేసులు సాక్షుల విచారణ, భూ రికార్డుల సేకరణ, కోర్టు స్టేలు తదితర కారణాలతో పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. పశుసంవర్ధక శాఖ ద్వారా జిల్లాలో ఎస్సీ లబ్ధిదారులకు మంజూరైన గోకులాల వివరాలను ఎస్సీ కమిషన్ ఛైర్మన్ అడిగి తెలుసుకున్నారు. గోకులాల ద్వారా పాడి రైతుల ఆదాయం పెరగడంతో పాటు వర్మీ కంపోస్ట్ తయారీ ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

జిల్లాలో ఎస్సీ లబ్ధిదారులకు సీనియారిటీ జాబితా ప్రకారం ఇప్పటివరకు 46 బోరు కనెక్షన్లు మంజూరు చేసినట్లు విద్యుత్ శాఖ ఎస్ఈ వివరించారు.పదో తరగతి ఫలితాలపై సమీక్షిస్తూ, ఉత్తీర్ణత శాతం మరియు విద్యార్థుల సంఖ్యపై డీఈఓను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా తెలుగు సబ్జెక్టులో ఎక్కువ మంది విద్యార్థులు విఫలమైన నేపథ్యంలో తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

రుద్రవరం మండలానికి చెందిన మధ్యాహ్న భోజన పథకం ఆయాకు ఐదు నెలలుగా వేతనం అందలేదన్న ఫిర్యాదుపై విచారణ జరిపారు. వేతనం బ్యాంకు ఖాతాలో జమ చేసినప్పటికీ ఉపసంహరించుకోలేదనే ఫిర్యాదుపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

హార్టికల్చర్, సూక్ష్మ నీటిపారుదల పథకాల కింద అవసరమైన గుంతల తవ్వకాలను ఉపాధి హామీ పథకం ద్వారా చేపడితే రైతులకు మరింత ప్రయోజనం కలుగుతుందని సూచించారు.

ఎస్ఆర్‌బీసీ కార్యాలయంలో కారుణ్య నియామకంలో చేరిన ఉద్యోగి సర్వీసు రెగ్యులరైజేషన్‌కు సంబంధించిన వినతిపై సాధ్యాసాధ్యాలను పరిశీలించి నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు.

జిల్లాలోని 120 మత్స్యకార సంఘాల్లో ఎస్సీ సంఘాలు కేవలం మూడు మాత్రమే ఉన్నాయని, వారి జనాభా నిష్పత్తికి అనుగుణంగా మరిన్ని సంఘాలకు అవకాశాలు కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఆర్టీసీ ఉద్యోగి ఎం. కరుణయ్యకు పదోన్నతి ఇచ్చినప్పటికీ పోస్టింగ్ ఇవ్వలేదన్న ఫిర్యాదుపై స్పందిస్తూ, తగిన చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ ఆర్ఎంను ఆదేశించారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com